గోలకొండ పత్రిక చందా రేట్లు

సంవత్సరానికి	రు.	27-00
అర్ధ సంవత్సరానికి	,,	14-00
3 నెలలకు	,,	7-00
విడికాపీ	7	నయాపైసలు
ఆదివారం సంచిక	10	,,

మూడు నెలలకు తక్కువ చందా తీసుకోబడదు.

స్థాపితము 1926 రిజిష్టర్ నెం. 92

గోలకొండ పత్రిక

(10188) సంపాదకుడు: ఎస్.నరోత్తమరెడ్డి, ఎం.ఏ

సంపుటి 16 సంచిక 308 * హైదరాబాదు 24—11—1963 ఆదివారం * 6 పేజీలు 10 నయాపైసలు

ఫ్రెంచి మాజీప్రధాని, హుస్సేన్ రాజుల నగరాగమనం

హైదరాబాద్, నవం 23: డిసెంబరు నెలలో ఇద్దరు ప్రముఖులు హైదరాబాద్ రానున్నారు. ఫ్రెంచి మాజీప్రధాని మెసంజెస్ ఫ్రాన్స్ డిసెంబరు 2న నగరానికి వచ్చి రెండు దినాలుంటాడు. డిసెంబరు 3న ఆయన రాష్ట్రశాసనసభ్యులను కూడా కలుస్తాడు. జోర్డాన్ రాజు హుస్సేన్ డిసెంబరు 12న హైదరాబాదు వస్తాడు. ఆయనకు గౌరవపట్టప్రదానం జరిపేందుకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రత్యేక స్నాతకోత్సవం ఆ రోజు సాయంత్రం ఏర్పాటయింది. లండన్ టైమ్స్ పత్రికలో ఇండియా-పాకిస్తాన్ వార్తల ఇన్‌ఛార్జిగా ఉంటున్న రిగర్డువోరిస్ ఈనెల 3న తేదీన నగరానికి వస్తాడు. మూడుదినాలు నగరములోఉండి 28న బెంగుళూరు వెళ్తాడు.

కెనడీహత్యకుపాల్పడిన ఆస్వాల్డ్ అనువ్యక్తిసర్వబంధం

నిర్బంధ సేవ క్లాజు ఉపసంహరణ

పంచాయతీ సభ్యుల ఎన్నికకు రహస్య ఓటింగ్ పద్ధతి: మంత్రి డా॥ చెన్నారెడ్డి అంగీకారం

హైదరాబాద్, నవంబరు 23

పంచాయతీ ఓటరు నెవరినైనా పిలిపించి గ్రామస్థులకు ప్రయోజనకరమైన ఏపనినైనా చేయవలసిందని పంచాయతీ వారు ఆదేశించవచ్చుననే నిబంధనను గ్రామ పంచాయతుల బిల్లు నుండి తొలగించడానికి పంచాయత్ రాజ్ మంత్రి డా॥ ఎం చెన్నారెడ్డి అంగీకరించారు,

ఈ నిబంధన వెట్టిచాకిరీకిందికే జమ అవుతుందని శాసనసభ్యులు బిల్లుపై నాలుగు దినాల చర్చలో విమర్శించారు. ఇది సర్వసాధారణ నిబంధన అయినప్పటికీ సభ్యుల విమర్శ దృష్ట్యా ఉపసంహరణకు ప్రభుత్వము అంగీకరిస్తున్నట్లు డా॥ చెన్నారెడ్డి యీవేళ శాసనసభలో తెలిపారు.

గ్రామ పంచాయతీలబిల్లుపై నాలుగు దినాల సాధారణ చర్చ నేడు ముగిసి ఈవేళ క్లాజువారీ చర్చ ప్రారంభమైంది. పంచాయతులకు సభ్యులను రహస్య ఓటింగ్ పద్ధతిపై ఎన్నుకోడానికి అవకాశం బిల్లులో కల్పించడానికి కూడా డా॥ చెన్నారెడ్డి అంగీకరించారు. శాసనరీత్యా తయారయ్యే రూల్స్‌లో ఈ అవకాశం కల్పిస్తారు. పంగ్రామంలోనైనా పంచాయతి ఏర్పాటుకు ప్రతిపదికనిర్ధారణ, షెడ్యూల్డు కులాలు తెగలకు సభ్యత్వంలో రిజర్వేషన్ మున్నగు అంశాలు కూడా ఆ రూల్స్‌లోనే నిబంధిస్తారు.

పంచాయతి సభ్యులకు సిటింగ్ ఫీజు ఇవ్వాలనీ, పంచాయతి సభ్యులను వాపసు పిలిపించే హక్కు ఓటర్లకివ్వాలనీ కొందరు కావించిన సూచనలను మంత్రి నిరాకరించారు. న్యాయపరాయతమయముందు ఏ పక్షం తరఫునైనా న్యాయవాదులు హాజరై వాదించవచ్చునన్న నిబంధన వివాదాల సత్వర పరిష్కారానికి ఉద్దేశించినదేగాని న్యాయ పంచాయతులను న్యాయస్థానాలుగా మార్చేందుకుకాదని మంత్రి వివరించారు.

క్లాజువారీ చర్చ సందర్భంగా శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య (స్వ) పంచాయతి అధ్యక్షుని అధ్యక్షుడని వ్యవహరించాలిగాని సర్పంచ్ అనరాదంటూ తెచ్చిన సవరణ ఓడింపబడినాల్గో క్లాజు ఆమోదింపబడింది. ఐదో క్లాజు పరిశీలన చేపట్టబడిన సమయంలో శాసనసభ సోమవారానికి వాయిదా పడింది.

సోమవారంనాడు ఆర్థిక మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి 63-64 సంవత్సరానికి అదనపు సప్లిమెంటరీ ఖర్చు అంచనాల నివేదికను శాసనసభకు సమర్పిస్తారు. శాసనసభ డిసెంబరు 12,13 తేదీల్లో కూడా సమావేశమవుతుందని నేడు డిప్యూటీ స్పీకర్ ప్రకటించారు.

గ్రామ పంచాయతులకు ఎన్నికల నిమిత్తం ముసాయిదా ఓటర్ల జాబితాలు ఫిబ్రవరి 1 న ప్రచురిస్తారనీ మార్చి 1 న కీకర జాబితాలు వెల్లడి అవుతాయనీ మంత్రి డా॥ చెన్నారెడ్డి ఈవేళ తెలియజేశారు.

ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల ప్రమాణ స్వీకారం

విధిగా నిబంధిస్తూ ఎన్నికల కమిషన్ ప్రకటన

న్యూఢిల్లీ, నవం 23

పార్లమెంటుకూ, రాష్ట్ర శాసనసభలకూ (కేంద్ర పాలిత ప్రాంతాలలోని శాసనసభలతోసహా) జరిగే ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం అధికారం పొందిన ప్రభుత్వోద్యోగి ముందు విధేయతా ప్రమాణ స్వీకారం చేయవలసి వుంటుందని భారత ఎన్నికల కమిషను ఒక పత్రికా ప్రకటనలో తెలియజేసింది.

నామినేషన్ పత్రాలను శాఖలు చేసేముందే అభ్యర్థులు ఈ ప్రమాణ స్వీకారము చేయడము ఎన్నికల కమిషను సూచించింది. అభ్యర్థులు యీ ప్రమాణస్వీకారము విధిగా చేయవలసి ఉండనీ, అలా చేయని సందర్భాలలో, వారి నామినేషను పత్రాలను పరిశీలించేటప్పుడు వాటిని తోసిపుచ్చడమవుతుందనీ ఎన్నికల కమిషను హెచ్చరించింది.

అసెంబ్లీపరిసరాల్లో నిషేధాజ్ఞలు

హైదరాబాద్, నవంబరు 23

ఆంధ్రప్రదేశ్ శాసనసభా భవనాలున్న ప్రదేశానికి చుట్టుపట్ల అరమైలు దూరములోపల సభలు,సమావేశాలు, ఊరేగింపులు నిషేధిస్తూ పోలీసు కమిషనరు ఉత్తర్వులు జారీచేశారు. యీ ఉత్తర్వులు రేపు ఆదివారముఅర్ధరాత్రి మండి30వ తేదిఅర్ధరాత్రివరకుత్రిస్తాయి.

విదేశాలకు పంపదలచే భారతీయ నిపుణుల జాబితా

న్యూఢిల్లీ, నవంబరు 23

ఆసియా, ఆఫ్రికాదేశాలు కోరినట్లయితే వెంటనే పంపగలందులకు వీలుగా విద్యాబోధన, వైద్యం, ఇంజినీరింగ్ రంగాలలో అనుభవం, అర్హతలు కలిగిన భారతీయ నిపుణులపేర్ల జాబితాను తయారుచేయాలని భారత ప్రభుత్వం నిశ్చయించింది

ఆవిధంగా విదేశాలకు వెళ్ళకోరే వారు తమ పేర్లను రోజాంగ మంత్రిత్వ శాఖవద్ద నమోదు చేసుకోవచ్చును. అయితే వారికి ఇంగ్లీషు, గణితశాస్త్రం, ఆర్థికశాస్త్రం, పదార్థ విజ్ఞానశాస్త్రం, రసాయనికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంలో ఉపాధ్యాయుడు, లెక్చరర్, ప్రొఫెసర్‌గా గానీ, ఫిజీషియన్, సర్జన్, నెర్సు, ముక్కు, గొంతునిపుణుడు, సుఖవ్యాధుల నిపుణుడు, ఎనెస్థెటిస్టుగాగానీ, లేదా సివిల్ ఇంజినీర్, మెకానికల్ ఇంజినీర్, ఎలెక్ట్రికల్ ఇంజినీర్, మెటలర్జికల్ ఇంజినీర్, మైనింగ్ ఇంజినీర్ గా గానీ, సర్వేయర్‌గాగానీ, లేదా హస్తశాస్త్ర నిపుణుడుగాగానీ కనీసం ఐదుసంవత్సరాలు అనుభవము వుండాలి.

శాంతి ప్రియులందరకూ అశని పాతం

కెనడీ మృతికి సంతాపం వెల్లడిస్తూ రష్యాప్రధాని కృశ్చేవ్ ప్రకటన

మాస్కో, నవం 23

శాంతిని, రష్యా- అమెరికా సహకారాన్ని ఆశించేవారందరికీ కెనెడీ హత్య వార్త అశనిపాతంవంటిదని రష్యా ప్రధాని కృశ్చేవ్ తన సంతాపాన్ని ప్రకటించినట్లు టాస్ వార్తా సంస్థ వెల్లడించింది. అంతర్జాతీయతీవ్రత సడలింపబడుతున్న ఈ వాతావరణంలో ఈ ఘోరదురంతానికి పాల్పడిన వారిపట్ల సోవియట్ ప్రజలు ఏహ్యభావం ప్రకటిస్తున్నారని కృశ్చేవ్ లిండన్ జాన్సన్‌కు ఒక సంతాప సందేశం పంపుతూ పేర్కొన్నాడు. కెనెడీ విశాల దృష్టి కలవాడని ఆయన జోహార్లర్పించాడు.

నల్లటిసూటుధరించి ఖిన్నవదనుడై వెళ్ళి కృశ్చేవ్ నేటి సాయంత్రం అమెరికా రాయబారి ఇంట సంతాప గ్రంథంలో సంతకంచేసి వచ్చాడు.

పెకింగ్ రేడియో కెనెడీ హత్య వార్తను అమెరికా, ఇండియా, కొలంబియాలను నుమ్మెత్తిపోయడానికి ఉద్దేశించే ప్రసారాల్లో ఈ ఉదయం ప్రకటించింది. పెకింగ్ పీపుల్స్ డైలీ హత్యావార్త చేరేముందే ముద్రింపబడింది. ఆ పత్రికలో భారతదేశానికి అమెరికా వైమానిక శిక్షణ విన్యాసాలలో సహాయపడినందుకు విమర్శిస్తూ కెనెడీపై ఒక వ్యంగ్య చిత్రం ప్రచురించబడింది. నవజైనా వార్తా సంస్థ వ్యాఖ్యానంలేకుండా ఈ వార్తను స్పష్టంగా ప్రకటించింది.

కాలిడోనియా అధిపతి నరోదం సిహానౌక్ దేశమంతటా రెండుదినాలు సంతాపం పాటించాలని ఆదేశించాడు. దేశమంతటా పతాకాలు అవనతం చేయబడ్డాయి.

ఐక్యరాజ్యసమితి సంతాపం

ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధిసభ నిన్న కెనెడీ హత్యవార్త అందగానే ఒక నిమిషముపాటు సంతాప సూచకముగా మౌనం పాటించి సమావేశాన్ని వాయిదావేసింది కెనెడీ హత్య గురించి సమితి అధ్యక్షుడు కాస్టాస్ పోసారోడ్రిగ్యూ ప్రకటించారు.

సోమవారమునుండి సమావేశమైన పక్షిణాఫ్రికా జాతి విద్వేష వైఖరిని చర్చించాల్సి ఉన్న ఐక్యరాజ్యసమితి భద్రతాసంఘము తన సమావేశాలను కాలనిర్ణయము లేకుండా వాయిదా వేసింది.

కెనెడీ హత్యావార్త అందినప్పుడు రహస్య విచారణ సమావేశంలో ఉన్న అమెరికా సుప్రీంకోర్టు వాయిదా పడింది. వచ్చేవారము జరుగాల్సి ఉన్న అమెరికా కాంగ్రెసు సమావేశము కూడా వాయిదాపడింది.

నూతన అధ్యక్షుడుగా లిండన్ జాన్సన్ నిన్ననే వాషింగ్‌టన్‌కుబైలుదేరుతున్న అధ్యక్షవిమానంలోప్రమాణ స్వీకారము కావించారు. కెనెడీ మృతకాయముతోపాటు ఆయన వాషింగ్‌టన్ చేరాడు. కెనెడీ కళేబరాన్ని వైట్‌హౌస్‌కు చేర్చి అక్కడ ప్రజల సందర్శనం కోసము ఉంచారు. ఈవిశేషాలన్నీకూడా అమెరికా టెలివిజన్ కేంద్రాలు ప్రసారము చేస్తున్నాయి.

కెనడీ మృతికి హాలీవుడ్ విచారం

అమెరికా అధ్యక్షుడు కెనెడీ హత్యోదంతం అమెరికన్ చలనచిత్ర సీమను కూడా దుఃఖాక్రాంతం కావించింది.

సిగ్గీ నటుడు శామీడేవిస్ ఈ వార్తను నమ్మడం నాకిష్టంలేదని విచారము వ్యక్తపరిచాడు. అతనితో ఒక చిత్రాన్ని నిర్మిస్తున్న ఫ్రాంక్ సినాట్రా కూడా కెనడీ మరణవార్తను నమ్మతానని ప్రపంచానికి గొప్ప నష్టమనీ అన్నాడు.

"మైఫెయిర్ లేడీ" చిత్రం నెగ్రో పాత్ర పోషించిన నటుడు ఆండీ హార్డీ ఈవార్త విని అలా గే కూలిపోయి గి. నటుడు జాన్ వాయిన్ కూడా మూర్ఛిల్లాడు. ఒక పట్టు ఘట్టం నటిస్తున్న తెల్సుకార్నరు కన్నీరుకార్చి ఇకనటించజాలనన్నాడు. హాస్యనటుడు చబేపోస్ అమెరికా ప్రజలతో ప్రపంచ ప్రజలతో కలిసి దుఃఖించడమే ఇకమిగిలింది అన్నాడు. కెనెడీ శావమరదులలో ఒకడయిన పీటర్‌లాఫోర్డు వెంటనే కుటుంబంతో వాషింగ్టన్ వెళ్ళాడు.

సెనేటర్ టవర్‌ను చంపుతామని హెచ్చరికలు

టెక్సాస్ సెనేటరు జాన్ టవర్‌ను, అతని భార్యనుచంపుతామని హెచ్చరిస్తూ ఆకాశరామన్న టెలిఫోన్‌లు వచ్చాయి. జాన్ టవర్ సిమెంటిని సరఫరా ప్రాంతానికి తరలించారు. కెనడీ హత్యకు టవర్ పరోక్షముగా బాధ్యత వహించాల్సిఉన్నట్లు ఈ టెలిఫోన్ హెచ్చరికల్లో ఆరోపించబడింది. సెనేటర్ టవర్ కెనడీ రాజకీయ ప్రత్యర్థులలోనైన టెక్సాస్ ప్రముఖుల్లో ఒకడు.

"నిన్నటిరోజు నిజంగా దుర్దినం"

ప్రధాని శ్రీనెహ్రూ సంతాపం: కెనెడీకి, 5గురు భారతసైన్యాధిపతులకు జోహార్లు

న్యూఢిల్లీ, నవం 23

"కెనెడీ వీరమరణం పొందారు. ఆయన హత్య కావించబడడం యావత్ప్రపంచానికీ హృదయ విదారకమైన విషాద సంఘటన. అమెరికా ప్రజల దుఃఖంలో భారతీయులు కూడా పాలు పంచుకుంటున్నారు" అని ఈ రాత్రి ఆలిండియా రేడియో కేంద్రంనుండి ప్రత్యేక సందేశాన్ని ప్రసారంచేస్తూ ప్రధాని శ్రీ నెహ్రూ కెనెడీకి జోహార్లర్పించారు.

నిన్నటిదినం ఒక దుర్దినం. అన్నీ నిన్న విషాద సంఘటనలే ఎదురయ్యాయి. నిన్న మధ్యాహ్నము పూంచ్ వద్ద విమానప్రమాదంలో మన సైన్యాధిపతులు ఐదుగురు మరణించిన వార్త వచ్చింది. ఆ విచారంలో మునిగి ఉండగానే రాత్రికి కెన్నడీ హత్యా వార్త వచ్చి దిగ్భ్రాంతుల్ని చేసింది అని శ్రీ నెహ్రూ అన్నారు.

కెనెడీ మృతివల్ల అనేకరకాల విభిన్నపరిమాణాలు సంభవించవచ్చుననీ ఆయన అనుసరించిన ఉదారవిధానాలు కొనసాగించబడుతాయనీ సత్ఫలితాలు సాధించబడుతాయని తాను విశ్వసిస్తున్నాననీ ప్రధాని శ్రీ నెహ్రూ పేర్కొన్నారు.

నేటి సాయంత్రము ఢిల్లీలయన్స్ క్లబ్ హరి విద్యామందిర్ ప్రారంభోత్సవ సభలోకూడా ప్రసంగించినప్పుడు శ్రీ నెహ్రూ కెనెడీ మృతి ప్రపంచాన్ని విచారసాగరములో ముంచిందనీ ఆయన అనుసరించిన సద్విధానాలు దెబ్బ తినవచ్చునేమోననీ ప్రస్తావించారు. ప్రపంచ శాంతి సడలింపడానికి ఆయన ఎనలేని సేవచేశాడన్నారు. ఆసియా ఆఫ్రికాల్లోని బడుగు దేశాలకు ఎంతో సహాయపడ్డాడనీ అమెరికా నీగ్రోల సముద్ధరణకు పాటుపడ్డారనీ ఈ విధానాలు నచ్చని వారెవరో హత్యచేసిఉంటారనీ ఇది ఉన్మాదమేననీ శ్రీ నెహ్రూతన విచారం వెల్లడించారు.

నిన్న ఐదుగురు భారత సైన్యాధిపతులు, నిపుణులైనవారు, దేశానికి ఎంతో సేవచేసిన అనుభవజ్ఞులు మరణించడముకూడా భారతదేశానికి తీరని లోటు అని ప్రధాని శ్రీ నెహ్రూ పేర్కొన్నారు.

ప్రధాని శ్రీ నెహ్రూ తన సానుతాపాన్ని కెనెడీ సతికి కేబుల్ ద్వారా అందజేశారు. కేంద్రాధికారమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారికూడా సంతాపము వ్యక్తపరిచారు.

కాంగ్రెసు అధ్యక్షుని సంతాపం

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ డి. సంజీవయ్య భారత జాతీయ కాంగ్రెసు తరఫున సంతాపము ప్రకటించారు. మానవజాతి శ్రేయస్కాముడనీ ప్రజాస్వామ్య స్వాతంత్ర్యాల పరిపోషకుడనీ శ్రీ సంజీవయ్య కెనెడీకి జోహార్లర్పించారు.

ఎ. ఐ. సి. సి. కార్యాలయములో నేడు సమావేశము జరిగి సంతాప తీర్మానము ఆమోదించబడింది.

బి.ఏ. బి.ఎస్సి ఫలితాలు

హైదరాబాదు, నవం 23

ఉస్మానియా బి.ఏ, బి.ఎస్సి. బి.కాం 1, 2 పార్టులు, బి.ఎస్సి హోం సైన్స్ పార్టు 1, బి.ఎస్సి వ్యవసాయం 1, 2, 3 పార్టుల పరీక్షల ఫలితాలు సోమవారంనాటి పత్రికల్లో ప్రచురించబడుతాయి.

ద్రాక్షారామం మునిసిపల్ కౌన్సిల్ రద్దు

హైదరాబాద్, నవం 23

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్రాక్షారామం మునిసిపల్ కౌన్సిలును ఆంధ్రప్రదేశ్ గెజెటులో ప్రకటించబడే తేదీ నుంచి రెండు సంవత్సరాల వరకు రద్దు పరచింది.

పూంచ్ ప్రమాదంపై విచారణ ప్రారంభం

మృతులైన సైన్యాధిపతులకు ఢిల్లీలో గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలు

న్యూఢిల్లీ, నవం 23

ఐదుగురు సైన్యాధిపతుల్ని బలిగొన్న పూంచ్ విమాన ప్రమాదంపై విచారణ జరుపడానికి భారత ప్రభుత్వం భారత వైమానిక దళం డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఏర్ వైస్ మార్షల్ రాజారాం అధ్యక్షతన విచారణ సంఘాన్ని ఏర్పాటుచేసింది. ఈ విచారణ సంఘం నేడే జమ్మూ వెళ్లింది.

నిన్న ప్రమాదంలో దుర్మరణము పాలైన లెఫ్టినెంట్ జనరల్ దౌలత్ సింగ్, ఏర్ వైస్ మార్షల్ పింటో నిన్న ఉదయం ఢిల్లీలోనే ఉన్నారట. తర్వాత డకోటాలో జమ్మూవెళ్ళి మిగిలినవారితోకలిసి పాలికాప్టరు ప్రయాణముచేశారట. దౌలత్‌సింగ్ తల్లి [65] ఈ ఉదయమే లండన్‌లోఉన్న రెండో కుమారుని వద్దనుండి జమ్మూకు వచ్చినది. ఆమెకు నిన్నటి ప్రమాదవార్త తెలియనే తెలియదు. రాగానే ఘోర వార్త వినాల్సి వచ్చింది.

ఈ ఉదయం ఢిల్లీలోని రక్షణశాఖ కార్యాలయాలు,సైనికనౌకా వైమానిక దళాల అన్ని వ్యవస్థలూ మూసివేయబడ్డాయి, రక్షణ మంత్రి శ్రీ చ్యవన్, సర్వసేనాని జనరల్ చౌధురి ఈవేళ మృతుల కుటుంబాలను కలిసి పరామర్శించారు. సోమవారం నుండి నూర్పు సరిహద్దు రంగంలో జనరల్ చౌధురి పర్యటనకు వెళ్ళాల్సిఉండిగాని ఆ కార్యక్రమం రద్దు చేసుకున్నారు. అమెరికా, బ్రిటన్ల సేనానుల నుండి జనరల్ చౌధురికి సంతాప సందేశాలందాయి.

అంత్యక్రియలు

నిన్న మరణించిన సైన్యాధిపతులైదుగురిలో నలుగురి కాయాలకు ఈ సాయంత్రము భారతైనిక గౌరవాలతో యమునానది ఒడ్డున నిగమబోధ ఘట్టములో దహన సంస్కారాలు జరిగాయి. లెఫ్టినెంట్ జనరల్ దౌలత్ సింగ్, మేజర్ జనరల్ ఎస్. కె. దత్, నానావతి, బ్రిగేడియరు ఎస్. ఆర్. ఓబెరాయ్‌ల కాయాలకు చితులు పేర్చబడి నిప్పంటించారు. ఏర్ వైస్ మార్షల్ పింటో కాయానికి సఫ్దర్ జాంగ్ రోడ్‌లోని కేథలిక్ శ్మశానంలో ఖనన సంస్కారంజరిగింది. రక్షణమంత్రి చ్యవన్, మూడుశాఖల సేనానులు నిగమబోధ ఘట్టములో మృతకళేబరాలను స్వీకరించారు. ప్రధాని శ్రీ నెహ్రూ సమీపాన ఉన్న ఒక చెట్టు క్రింద ఖిన్నవదనంతో మౌనముగా నిలబడి అరగంటసేపు అంత్యక్రియల్ని తిలకించారు.

ఎర్రకోటనుండి నిగమబోధ ఘట్టం వరకూ సాగిన ఊరేగింపులో వేలాది ప్రజలు, నాయకులు పాల్గొన్నారు. జనరల్ కరియప్ప, జనరల్ పి. ఎస్. థాపర్, లెఫ్టినెంట్ జనరల్ కుల్వంత్ సింగ్ మున్నగు మాజీ సేనానులు కూడా ఊరేగింపు వెంట నడిచారు

ప్లయిట్ లెఫ్టినెంట్ సోధి కళేబరానికి అమృతసరులో అంత్యక్రియలు జరిగాయి. ఆతని కాయాన్ని స్వర్ణదేవాలయానికి కొంపోయి అక్కడ నుండి స్వగృహానికి చేర్చారు. తర్వాత ఊరేగింపుగా శ్మశానికి కొంపోయి అంత్యక్రియలు జరిపారు.

లెఫ్టినెంట్ జనరల్ విక్రంసింగ్ అంత్యక్రియలు జమ్ములో జరిగాయి, వేలాదిప్రజలు పాల్గొన్నారు. నేడు కాశ్మీరులో ప్రభుత్వ కార్యాలయాలన్నీ సంతాప సూచకంగా మూసివేశారు.

వైట్‌హౌస్‌లో అమెరికా నాయకునికి అశేషప్రజ నివాళి

వాషింగ్టన్, నవంబరు 23

నిన్న టెక్సాస్‌లో పర్యటన సందర్భముగా హత్య చేయబడిన కెనెడీ కాయాన్ని రాత్రికిరాత్రే ప్రత్యేక విమానములో కాంస్యపేటికయందు భద్రపరచి వాషింగ్టన్‌లోని ప్రెసిడెంట్ అధికార నివాసభవనం వైట్‌హౌస్‌కు చేర్చారు. నేడు వైట్‌హౌస్‌లో ఉంచిన కెనెడీ కాయం రేపు అధికార లాంఛనాలతో రొటుండాకు మార్చబడి సోమవారం మధ్యాహ్నము సెయింట్ మాథ్యూకెథెడ్రల్‌లో అంత్య సంస్కారం కావించ బడుతుంది.

కెనెడి హత్య సందర్భంగా నిన్న రాత్రే టెక్సాస్‌లోని ఒక సినిమాహాలు నుండి అనుమానాస్పదముగా ప్రవర్తించిన లీహార్వేఆస్వాల్డు అను 24 సంవత్సరాల వ్యక్తిని అరెస్టు చేశారు.

గతరాత్రి ప్రత్యేక విమానములో నూతన అధ్యక్షుడు లిండన్ జాన్సన్, జాక్విలిన్ కెనెడీలు వెంటరాగా కెనెడీ కళేబరం కాంస్య పేటికలో వాషింగ్‌టన్‌కు తెచ్చి వైట్‌హౌస్‌కు చేర్చబడింది. అటార్నీ జనరల్ రాబర్ట్ కెనెడీ వాషింగ్‌టన్‌లో జాక్విలిన్‌ను కలిశాడు. జాక్విలిన్ కెనెడీ హత్య జరిగినప్పుడు ధరించిన దుస్తులే ధరించి ఉంది. ఆమెభర్త పెదవులు ముద్దాడి తన వేలి ఉంగరంతీసి ఆతని వేలికితొడిగింది. కెనెడీ కుమార్తె కారోలిన్ (6), కుమారుడు జాన్ (3) లకు తండ్రి మరణవార్త తెలియదు. తెలియనే తెలియదు. అమెరికా అంతా దుఃఖములో మునిగినా వీరిరువురూ వైట్‌హౌస్‌లో ఆడుకుంటున్నారు. కెనెడీ కాయాన్ని వైట్‌హౌస్‌కు తెచ్చేముందు వారిని ఎక్కడికో తీసుకుపోయారు. తండ్రి మరణవార్త వైట్‌హౌస్‌కు చేరిన సమయానికి కారోలిన్ ఆహారము తీసుకుంటోంది, జాన్ నిద్రిస్తున్నాడు. సాధారణంగా తలిదండ్రులుపర్యటనకు పోయేప్పుడు పిల్లల్ని వదిలిపోతారు. జాన్ సాధారణంగా తండ్రితెత్తుంటే పడ్డేవాడు. కాని ఈసారి పడవకుండా నవ్వుతూ "టాటా" చెప్పాడట. ఈ పసిపిల్లలకు తండ్రి మరణ వార్త వెల్లడించడం ఇప్పుడు జాక్విలిన్‌కు ఒక పెద్ద పరీక్ష.

అమెరికా అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారంచేసిన లిండన్ జాన్సన్ అధ్యక్ష విమానంలో వాషింగ్టన్ చేరగానే నా సాయశక్తులా చేయగలిగినంతా చేస్తాను. ఇందుకు మీసహాయం, భగవంతుని బలం అర్థిస్తున్నాను" అన్నాడు. దుఃఖిస్తూ గుక్కిళ్ళు మింగుతున్న ఒక మహిళా న్యాయమూర్తి జాన్సన్‌చేత విమానంలోనే ప్రమాణ స్వీకారం చేయించింది.

లిండన్ జాన్సన్ నేడు అధికార కార్యకలాపాలు చూసుకోడం ప్రారంభించాడు. జపాన్ పర్యటన మానుకొని మార్గ మధ్యనుండి తిరిగివచ్చిన విదేశాంగ మంత్రి డీన్‌రస్క్, తదితర అధికారులతోను, సెనేటర్లతోను, మాజీ అధ్యక్షుడు ఐసెన్ హోవరుతోను సంప్రదింపులు జరిపాడు.

హంతకుని ఉదంతం

నిన్న ఓపెన్ కారులో కెనెడీ ప్రయాణం చేస్తుండగా దారి ప్రక్కన ఉన్న ఐదంతస్తుల విద్యాశాఖ గ్రంథ నిలయం ఐదో అంతస్తునుండి ఆస్వాల్డు కాల్పాడని అనుమానిస్తున్నారు. కెనెడీని చూడాం రమ్మని తోటి ఉద్యోగి ఆస్వాల్డును కోరగా నువ్వు కిందకు వెళ్ళి చూడమని చెప్పాడు.ఆతడు కిందకు వెళ్ళిపోయాడు. తర్వాత మూడుసార్లు కాల్చిన ధ్వని వినిపించింది. కొంతసేపటికి భవనంనుండి వెళ్ళిపోతున్న ఆస్వాల్డును పోలీసులు ఆపగా తను అక్కడే పనిచేస్తున్నట్లు సాత్యంతోటి ఉద్యోగి ఇన్వాంగ్-వదలబడ్డాడు. అక్కడినుండి మరో సంఘటన జరిగింది, దారిలో ఒక పోలీసు అధికారి ఒకనిని ఆపి ఏవో ప్రశ్నించాడట. ఆతడు జవాబివ్వగా ఆ అధికారి కారులోనుండి క్రిందికిదిగాడు. వెంటనే ఆ వ్యక్తిని రివాల్వరు తీసి పేల్చి ఆతనిని చంపి పారిపోయాడు. ఇది చూసిన ఒకామె ఈ ఉదంతం తెలిపింది. ఆవ్యక్తి ఎవరో తెలియదు. ఆస్వాల్డు అనే అనుమానించారు.

ఆస్వాల్డు పిమ్మట ఒక సినిమాహాలు చేరుకొని భయసందేహాలతో వ్యవహరిస్తుండడం అక్కడి క్యాషియర్ కనిపెట్టి పోలీసులకు చెప్పాడు. పోలీసులు వచ్చి సినిమా మధ్యలో లోపల ప్రవేశించిన వారిని సోదా చేయడం ప్రారంభించగా ఆస్వాల్డు తన వద్దకు పోలీసు రాగానే రివాల్వరు తీశాడు. ఆతనిని బంధించగా కెనెడీని నేను చంపలేదు, నాకీవిషయం తెలియదు అంటూ కేకలు వేశాడు. బేడీలు తొడిగినాకా "అంతా అయిపోయింది" అన్నాడట. తర్వాత ఆతనిని నిర్బంధించి రాత్రి 10 గంటల పాటు ప్రశ్నించి సమాచారం పోలీసులు రాబట్టారు. కాని ఇంతకూ ఆ స్వాల్డు రివాల్వరు ప్రేల్చి కెనెడీని హత్యచేసినట్లు చూసినవారుఎవరూ లేరట.

ఈ ఉదంతాన్ని పోలీసుఅధికారులు వెల్లడించారు.

లీహార్వేఆస్వాల్డు 1959లో రష్యా వెళ్ళాడు. తిరిగి రష్యన్ భార్యతోను ఇద్దరు కుమార్తెలతోను ప్రదేశం తిరిగి వచ్చాడు. ఈతను క్యూబాలోని కాస్ట్రో అనుకూలవర్గం వాడంటున్నారుగాని ఆ వర్గంవారు ఆస్వాల్డు ఎవరో తమకు తెలియదన్నారు.

మెదక్ పట్టణంవైద్యుతీకరణకు రు. 35 వేలు మంజూరు

హైదరాబాద్, నవం 23

మెదక్ పట్టణ పౌరులచే సమర్పించబడిన మెమొరాండం ప్రకారం.మెదక్ పట్టణంలో విద్యుచ్ఛక్తి సరఫరా ఏర్పాట్లకు మరియు 80 విద్యుత్ స్తంభాల నెలకొల్పుటకుగాను రాష్ట్ర విద్యుత్ బోర్డుచే రు. 35,000 మంజూరీ చేయబడినవి.

పట్టణమునకు విద్యుత్ ఏర్పాట్ల గురించి సత్వరచర్యలు గైకొన్నందుకు విద్యుత్‌బోర్డు అధ్యక్షులు శ్రీ కె.వి. నర్సింగరావుకు మెదక్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ కె. నర్సింగరావు అభినందనలు తెలిపారు.

ఈపథకం గత ఏడు సంవత్సరముల నుండి అపరిష్కృతంగావున్నది.

బస్సు స్టాండుల నిర్మాణానికి రు. 40 వేలు

మెదక్ పట్టణంలో బస్సుస్టాండుల నిర్మాణానికి రు 40000 ఖర్చు చేయబడనున్నట్లు మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి శ్రీ కె. నరసింగ్ రావు తెలుపుచున్నారు.

కార్మిక, రవాణా మంత్రి శ్రీ.వి.వి. గురుమూర్తి, ఆర్.టి.సి. చైర్మన్ వైస్‌అడ్మిరల్ కటారి మరియు ఇంజనీర్లకు, శ్రీ నర్సింగరావు తమ అభినందనలు తెలిపారు.

శ్మశాన భూమి మూసివేత

హైదరాబాదు, నవం 23

హైదరాబాదు ముషీరాబాదులో గల భోలక్‌పూర్‌వద్దగల దిగువ వివరాలతో కూడిన స్మశాన భూమిని యిటుపైన పోయిన వారి పూడ్చుటకు ఉపయోగించరాదని ప్రభుత్వం ఆదేశించింది.

స్మశానం వివరాలు:-

ఉత్తరం: 1-4-888 నెంబరుగల శ్రీమతి భూలక్ష్మమ్మ యిల్లు దక్షిణం 1-4-881 నుండి 886 వరకూ నెంబర్లు: గల శ్రీమతి జి. రాములమ్మను యిల్లు 1-4387 నెంబరుగల శ్రీమతి అలుయమ్మ (నిర్మాణములోఉన్న యిల్లు) నూర్పు: 1-4-896 నెంబరుగల శ్రీ శాలయ్య యిల్లు.

పడమర: సిమెంటుకాంక్రీటు రోడ్డు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ

హైదరాబాద్, నవంబరు 23

పబ్లిక్ అకౌంట్స్ కమిటీవారు హైదరాబాద్ శాసనసభా భవనంలోని కమిటీ గదిలో 1963 డిసెంబరు 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు సమావేశమై తుంగభద్ర అనకట్ట పర్యటన కార్యక్రమాన్ని స్థిరపరుస్తారు. ఇతర అంశాలను పరిశీలిస్తారు.

అంతర్ కళాశాలల ఉత్సవాలు

డిశంబర్ 6 వ తేదీన ప్రారంభం

హైదరాబాద్, నవం 23

అంతర్ కళాశాలల సాంస్కృతిక కోత్సవములు డిశంబర్ 6 వ తేదీనుంచి నగరంలో ప్రారంభమవుతున్నాయి.

6 వ తేదీన నృత్యపోటీలు 7 వ తేదీన సంగీతపోటీలు జరుపబడుతాయి డిశంబరు 11 వ తేదీనుంచి 16 వ తేదీ వరకు తెలుగునాటక పోటీలు నిర్వహింపబడుతాయి. ఈ ఉత్సవములలో నాల్గు మహిళా కళాశాలలతో సుమారు 25 కళాశాలలు పాల్గొంటున్నాయి. ఈ నాటికపోటీల సందర్భములో ప్రతిరోజు రసజ్ఞుల ఉపన్యాసములుంటాయి. శ్రీయనులు పి. వి. నరసింహారావు; యు. ఆర్. అప్పారావు; ఆలపాటి వేంకటామయ్య; దుక్కిపాటి మధుసూదనరావు; అక్కినేని నాగేశ్వరరావు సలహాలు; సహాయ సంపత్తులతో ఈ ఉత్సవాలు నిర్వహింపబడుతున్నాయి.

జవుళి యంత్రాల పరిశమకు రక్షణ

1966 డిసెంబరు 31 వరకు

న్యూఢిల్లీ, నవం 23

జవుళి యంత్రాల పరిశమకు యిస్తున్న రక్షణ మరో మూడేళ్ళ పాటు, అంటే 1966 డిసెంబరు 31 వరకు కొనసాగించాలని టారిఫ్ సంఘం చేసిన సిఫారసును భారత ప్రభుత్వం సమ్మతించినట్లు అంతర్జాతీయ వ్యాపార మంత్రిత్వశాఖ ఈ రోజున పత్రికా ప్రకటన చేసింది. యంత్రాల విలువమీద నూటికి పది రక్షణ సుంకం విధించబడుతుంది.

జవుళి యంత్రాల (స్పిన్నింగురింగ్ ఫ్రేమ్స్, కదుళ్లు, స్పిన్నింగు రింగ్స్, ప్లేటెడ్ రోలర్సు, ఆటోమాటిక్ లూమ్స్) పరిశ్రమకు మరికొంత రక్షణ యివ్వాలని సూచిస్తూ టారిఫ్ సంఘం సమర్పించిన నివేదికపైన భారత ప్రభుత్వ తీర్మానాన్ని ఈ రోజున భారత గెజిట్ లో ప్రచురించారు.

ప్రభుత్వ తీర్మానంలోని కొన్ని సిఫారసులు జవుళి యంత్రాల ఉత్పత్తిదారులు జవుళి యంత్రాల పరిశమకు చెందినవారి దృష్టికి తీసుకొనబడినాయి.

పెండ్లికన్న ముందు

పెండ్లి తరువాత నైన మీ కెట్టికార నెము వల్ల ఏ నా స్త్రీ పురుష సంబంధము లైన గుప్త రోగములు వచ్చిన యెడల 42 సం॥ లు అనుభవమును, పరిశోధనమును పొందిన డా॥ చౌహాన్ (GO/T REGD) గారిని సంప్రదించిన క్రొత్త యవ్వనమును, పుష్టిని పొందగలరు. మీ కెట్టి సంకోచము అవసరము లేదు. ఔషధములతో పాటు విద్యుత్ యంత్రములతో గూడ చికిత్సజరుపబడును. చికిత్స విషయములు రహస్యముగా నుంచబడును. షరా! ఆదివారము నాడు కూడా తెరువబడియుండును.

సంప్రదించు వేళలు: ఉదయం॥ గం॥ 9 నుండి సాయంత్రము 9 వరకు.

మేనేజర్ కుల్దీప్ మెడికల్ హాల్

(1947 స్థాపితము)

కాంప్లి చమన్, సయీదియాలాజ్ ఎదుట, పబ్లిక్ గార్డెన్ రోడ్, హైదరాబాద్- (ఆం. ప్ర.)

మల్టి కాంప్లెక్స్

ఇంజక్షను

నరముల బలహీనతకు, అనేక రకములైన విటమినుల లోపమువలన కలుగు బాధలకు,

రామ బాణము, 10 మి,లి. వయలు రు. 3-50 పోస్టేజి రు. 1-25

ఇండియన్ మెడిసిన్ హౌస్

విజయవాడ- 2.

రేపటినుండి గురువారం వరకు

ప్రతిరోజు 2 ఆటలు:

ఉ॥ 10-30 మరియు సా॥ 2-15

శ్రీ ప్రొడక్షన్స్:

అభిమానం

తా: నాగేశ్వరరావు, సావిత్రి, కృష్ణకుమారి.

సంగీతం: ఘంటసాల.

రాహత్ మహల్

ముషీరాబాద్, హైదరాబాద్.

శోభకృత్ నామ సం॥ మార్గశీర్ష శు॥ అష్టమి రా 1-10 ధనిష్ఠ ఉ 11-4 రా వ 6-16 మొదలు: 7-52 వరకు (శాలివాహన శకము: 3-9-1885) 24-11-1963 ఆది వారము

శోభకృత్ నామ సం॥ మార్గశీర్ష శు॥ నవమి రా 12-4 శతభిషం ఉ 11-34 సా వ 5-14 మొ: 6-47 వరకు (శాలివాహన శకము: 4-9-1885) 25-11-1963 సోమ వారము

"జ్ఞానము విజ్ఞానము నీ మానిత గుణము లగు నవి సమగ్రము లైనం గానేరదు మోక్షపదము గాను పు దృఢ నిశ్చయుండు గాకున్నే నిన్."

—భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్ నెం. 35280

24 నవంబరు 1963

ఆది వారము

కెనడీ హత్య

—(o)—

శాంత్యహింసా సహజీవన కాంతి రేఖలతో ప్రపంచాన్ని వెలిగించే పాశ్చాత్య ఖండం ఆదమరచి నిద్రిస్తున్న చీకటితరుణములో పాశ్చాత్య నాయకరాజ్యంలో ఒక ఘోర పాశవిక భయంకర హత్యాకాండ సాగినది. ఈ దుర్వార్త వింటూ కళ్లు నులుముకొని ప్రాచ్య ఖండము జాగృతమయిన తరుణానికి పాశ్చాత్య దిశలో అంతా విషాదాంధకారం అలుముకొంది. ఇది వేసవిలో ఆశనిపాతము వంటిది.

యువకుడు,అభ్యుదయవాది, ముఖ్యముగా భారత దేశానికి కూరుహితైషి అయిన జాన్ ఫిజెరాల్డు కెనెడీని ఎవరో ఒక రాక్షసుడు హత్యచేశాడు. ఇది నాగరక ప్రపంచంలో ఎల్లరనూ దిగ్భ్రాంతుల్ని చేసే విషాదసంఘటన. కెనెడీ హత్య భారతీయులకు మరింత సంతాప హేతువు. చైనా దురాక్రమణను ఎదుర్కొడానికి మనకు తక్షణ సహాయం అందించిన అగ్రరాజ్యానికి 34 వ అధ్యక్షుడుగా కెనెడీ వ్యవహరించి నందువలన కాదు- మన జాతిపిత, మార్గదర్శి మహాత్మాగాంధీ ఎటువంటి మత విద్వేష కలుషాంధునిచేత హత్య కావించబడినారో అటువంటి జాతి విద్వేష కలుషాంధునిచేతనే కావచ్చు కెనెడీహత్యకావించబడినందువలన. కెనెడీనిహత్యచేసినది శ్వేతజాతీయుడేనని అనుమానిస్తున్నారు. తీవ్ర దక్షిణ పక్షవాదులు ఈహత్యచేసినట్లు టాస్ వార్తా సంస్థ వ్యాఖ్యానించింది. మాస్కో రేడియో తన ప్రసారాన్ని నిలిపి హత్యవార్త ప్రకటించి విషాదసంగీతం ప్రసారము చేసింది. నీగ్రో జాతిని సముద్ధరించి శ్వేతజాతీయులతో పాటు వారికి సమానహక్కులుకల్పించడానికి కంకణంకట్టుకున్న కెనడీ లక్ష్యాన్ని దిగలాగె కన్సర్వేటివ్ శక్తుల కూడలిఅయిన టెక్సాస్ రాష్ట్రంలో ఈ హత్య జరిగింది. ఇంకేమి కావాలి? పతిత పీడిత ప్రజోద్ధరణ ఒక నేరమై కెనెడీని బలిగొన్నది. అమెరికాచరిత్రలో కెనెడీ మరోలింకన్ అయినాడు. ఇందువలననే భారతీయులకు ఇది మరింత విషాదకర వార్త.

కెనెడీ అధ్యక్షుడుగా ఎన్నికైనప్పుడు ప్రపంచ దేశాలు ఎంతో సంతోషించిన సంగతి ఇంకా జ్ఞాపకంలోనేఉంది. కెనెడీ నీగ్రోలను సముద్ధరించడానికి జాతి విద్వేషవాదులకృషిని ఫెడరల్ శక్తితో ఎదుర్కొన్న శేముషి ఇంకావిస్మృతంకాలేదు. 1961 జనవరి 20 న కెనెడీ అమెరికా అధ్యక్షుడయ్యాడు. 2 సంవత్సరాల పదినెలల కాలం ఉజ్జ్వలముగా పరిపాలన నెరపాడు. న్యాయానికి నిలువబడి తుదకు పాశవిక ప్రవృత్తికి బలి అయ్యాడు. అగ్రకూటముల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ తీవ్రత తగ్గడానికి కెనెడీ హయాంలో జరిగిన కృషి అమెరికాచరిత్రలో శాశ్వతముగా స్వర్ణాధ్యాయం కాగలదు. బడుగు రాజ్యాలకు సాయపడే ఆయన ధ్యేయము మొక్కవోనిది. మన దేశంలో బొకారో ఉక్కుకర్మాగారానికి సహాయపడాలని కెనెడీ పడిన తాపత్రయం ఆయనసౌమనస్యానికి నిదర్శనం. కాని గూడుపుఠాణీ రాజకీయ ఒత్తిడులు కెనెడీని నిరోధించాయి. ఇష్టము లేకపోయినా బొకారో కర్మాగార సహాయపథకాన్ని ఆయన విరమించుకోవలసి వచ్చింది. ఇలాగే ఆయన ప్రగతిశీలం మీద భారమయిన ఒత్తిడిని తెచ్చిన సమస్య నీగ్రోల సముద్ధరణ సమస్య. అభివృద్ధికి ఆదర్శంగా చెప్పుకొనే అమెరికాలో బడుగు దేశమయిన భారతదేశంలోవలె "అంటరానితనం" అగేసరంగా నిలువడం ఊహించరాని విషయం. ఈవిచిత్రవైపరీత్యాన్ని ఎదుర్కొడానికికృతనిశ్చయుడై చివరకు 1963 నవంబరు 22 న ఆయన కన్నుమూశాడు. రష్యా వంటి విరుద్ధ దేశంనుండి కూడా నివాళు లందుకున్న ధన్యజీవి కెనెడీ.

ఇంతమాత్రాన సంకుచిత శక్తులు, రాక్షస ధోరణులు, అభ్యుదయ నిరోధకవర్గాలు బలపడుతాయనుకోడం కల్ల. కెనెడీ మరణం వలన నీగ్రోల సముద్ధరణదీక్ష కుంటుపడబోదు. కెనెడీ మరణించిన తరువాత అరగంటలోనే అధ్యక్ష బాధ్యతలను స్వీకరించి ప్రమాణ స్వీకారం కావించిన ఉపాధ్యక్షుడు లిండన్ జాన్సన్, కెనెడీ ఆత్మ శాంతించేట్లు నీగ్రోల సముద్ధరణోద్యమ జ్యోతిని మరింత ప్రజ్వలింపజేస్తాడని ఆశిద్దాము.

మరో విషాద ఘటన

నిన్ననే మరోవిషాద ఘటన జరిగింది. భారత ఉన్నత సైన్యాధిపతులు 5గురు ఒక్కసారిగా ఒక హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణంపాలయ్యారు. ఈనాడు భారతదేశం ఉన్న పరిస్థితుల్లో ఐదుగురు ఉద్దండులను, దక్షతగల యుద్ధ నిపుణులను, సైనిక నేతలను కోల్పోవడం విచారకరమే కాదు, కేవలము దురదృష్టకరం.

మన రక్షణశక్తులను పటిష్ఠం చేసుకోడానికి ఉద్దేశించి సంయుక్త వైమానిక శిక్షా విన్యాసాలు పూర్తి చేసుకొని నాల్గు దినాలైనా కాలేదు, రక్షణశాఖ విమానం ప్రమాదానికి గురికావడం, ఐదుగురు సైన్యాధిపతులు మరణించడం విధిప్రభావమో వాతావరణవిలాసమో, అశ్రద్ధా పరిణామమో తెలియదు. దేశములో ఎన్నో విమాన ప్రమాదాలు జరుగుతున్నాయి, ఎన్నో ప్రాణాలు నష్టపడుతున్నాయి. ప్రతి ప్రమాదానికి ఒకవిచారణా సంఘాన్ని వేయడం దాని నివేదికప్రమాద వార్త స్మృతిపథంనుండి తప్పిపోయిన ఎన్నాళ్ళకో అందడం చివరకు ప్రభుత్వంవద్ద "ఫైలు" కావడం పరిపాటి అవుతున్న కర్మకాండ. ఇప్పుడైదుగురు సైనికాధిపతుల్ని పొట్టనబెట్టుకున్న హెలికాప్టర్ ప్రమాదం ఎలా సంభవించినట్టు? చైనా దురాక్రమణ తర్వాత మన గూఢచారి యంత్రాంగం చాల నీరసంగా పనిచేసిఉన్నట్లు రక్షణ మంత్రి గుర్తించడం జరిగింది. రక్షణశాఖ అధీనంలోఉన్న పరికరాలు, విమానాలు, ఇతర శకటాల నిర్దుష్ట స్థితిని గురించి కూడా శ్రద్ధ వహించడము మున్ముందుకైనా మంచిది. లోటుపాట్లు ఎక్కడైనా కనిపించినప్పుడు కమిటీలను వేసే తత్వం వదులుకొని కార్యరంగంలోకి దూకే తత్వాన్ని మనం అలవరచుకోవాలి.

దేశప్రాదేశిక సమగ్ర రక్షణ దీక్షలోవుండి దుర్మరణం పాలైన 5గురు భారత ఉన్నత సైనికాధిపతులకు జోహార్లర్పిస్తూ వారి ఆత్మశాంతికై భగవానునికి అంజలిస్తున్నాం.

శాంతిప్రియుడు కెన్నడీతో సమిలావని నివాళి

న్యూఢిల్లీ, నవం 23

ప్రెసిడెంట్ కెన్నడీ హత్యావార్త నేటి ఉదయం యావత్ భారతావనిలో పరివ్యాప్తమై దేశ ప్రజల్ని దిగ్భ్రాంతుల్ని చేసి విచార సాగరంలో ముంచివేసినది.

ఢిల్లీలోనూ, రాష్ట్ర రాజధానులలోను శ్రీ కెన్నడీ గౌరవార్థం ప్రభుత్వ భవనాలపై పతాకాలు సగం వరకు దించబడినవి.

ఢిల్లీకి కెన్నడీ హత్య వార్త అందిన తక్షణమే రాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను, ప్రధానమంత్రి నెహ్రూను నిద్ర నుండి లేపి ఆవార్త తెలియజేయగా వారు తీవ్ర విచారాన్ని వ్యక్తపర్చారు.

వ్యక్తిగత కారణాల వల్లనూ, అంతర్జాతీయ కారణాల వల్లనూ ప్రెసిడెంట్ కెన్నడీ మరణవార్త తనకు తీవ్ర విచారాన్ని, దిగ్భ్రాంతినీ కలిగించినట్లు ప్రధానమంత్రి నెహ్రూ నేడిక్కడ వ్యక్తపర్చారు.

శ్రీ నెహ్రూ తమ కార్యాలయంలోనికి ప్రవేశిస్తున్నప్పుడు ప్రెసిడెంట్ కెన్నడీ హత్యపై వ్యాఖ్యానించవలసినదిగా కోరగా ఆయన ఇలాఅన్నారు "ఎవరు ఏమి చెప్పగలరు? ఘోరమైన సంఘటన జరిగినది.అర్ధరాత్రి ఈవార్త వినినప్పుడే నేను దిగ్భ్రాంతి చెందాను దీని పరిణామాలు చాలా తీవ్రంగానే ఉంటాయి."

అంతర్జాతీయసంబంధాలపైఈసంఘటనపడైనా ప్రభావంకలుగుతుందాఅని ప్రశ్నించగా, కెన్నడీ అనుసరించిన విధానాలే కొనసాగగలవని తాము ఊహిస్తానని నెహ్రూ చెప్పారు.

"ప్రెసిడెంట్ కెన్నడీ లేని కారణాన కొంత ప్రభావం ఉంటుంది. ఈ ప్రత్యేక సంఘటన వల్ల పర్యవసానం ఎలాఉంటుందో చెప్పడం కష్టం, రెండు విధాలా ఉండవచ్చు. ఆయన విధానం కొనసాగుతుందనే నేను భావిస్తాను. ఏది ఎలాగున్నా వ్యక్తిగత కారణాల వల్లా, అంతర్జాతీయ కారణాల వల్ల ఆయన మరణ వార్త మాకు తీవ్ర విచారాన్ని, దిగ్భ్రాంతినికలిగించింది"

రాష్ట్రపతి సానుతాపం

ధైర్య సాహసోపేతుడూ, విచక్షణా పరుడైన ప్రెసిడెంట్ కెన్నడీపై సల్పిన కిరాతకదాడి తమని తీవ్రంగా దిగ్భ్రాంతపర్చినదని, రాష్ట్రపతి రాధాకృష్ణన్ శ్రీమతి కెన్నడీకి పంపినసందేశంలో తమ విచారాన్ని సానుభూతిని వ్యక్తపర్చారు.

ప్రెసిడెంట్ కెన్నడీమృతి అనంతరము అధ్యక్షుని అధికార బాధ్యతలు స్వీకరించిన శ్రీ లిండన్ జాన్సన్‌కు మరో సందేశం పంపుతూ డా॥ రాధాకృష్ణన్ అమెరికన్లకు తమసానుభూతిని తెలియజేశారు.

రాష్ట్రపతి రాధాకృష్ణన్ శ్రీమతి జాక్విలన్ కెన్నడీకి పంపిన సందేశంలో ఇంకా ఇలా పేర్కొన్నారు.

ప్రెసిడెంట్ కెన్నడీపై జరిపిన రాక్షసచర్య మాఅందర్నీ దిగ్భ్రాంతుల్ని చేసింది. నేను అమెరికాలో ఉన్నప్పుడు ప్రపంచశాంతిపట్ల ఆయనకుగల ఆందోళన, ఆయన సౌమనస్యం తెలుసుకొన్నాను.

మానవస్వేచ్ఛా సాధనాకృషిలో ఆయన వీరుడుగా మరణించారు. ఆయన సేవలు చిరకాలం జ్ఞాపకము చేయబడుతాయి. మీకు ఇది మీహృదయ విదారకమైన సంఘటన. అయితే మీరుధైర్యాన్ని, సమానాన్ని అలవర్చుకోగలరని నేను మనసారఆశిస్తున్నాను దేశాలకుమాదిరిగానే వ్యక్తులకు కూడా ఇవి పరీక్షాసమయాలు ఇది మీకూ, అమెరికాప్రజలకు అలాటిదే ప్రపంచంలోని వేలాదిప్రజలు మీ విచారాన్ని పంచుకోడం మీకుకొంత ఊరట కలిగించవచ్చు. మీ పిల్లలకు నాసానుభూతి"

రాష్ట్ర అసెంబ్లీ జోహార్లు

హైదరాబాదు, నవం 23

ఒక హంతకుడి చేతుల్లో మృత్యువాతపడ్డ ప్రెసిడెంట్ కెన్నడీ మరియు కాశ్మీరులో భారత ఉన్నత సైన్యాధికారులు మరియు వైమానిక దళాధికారులు విషాదపరిస్థితుల్లో నిన్న మృతిచెందినందుకు ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ నేడు తన అత్యంత తీవ్ర సంతాపాన్ని వ్యక్తపరిచినది.

ప్రపంచ శాంతి వర్ధనకు సమైక్యతా సాధనకు ప్రెసిడెంట్ కెన్నడీ చేసిన మహోన్నత కృషికి సభా నాయకులు శ్రీ నీలం సంజీవరెడ్డి, సభాపతి శ్రీ బి. వి. సుబ్బారెడ్డి, ప్రతిపక్ష నాయకుడు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య మరియు ఇతరపార్టీల నాయకులు జోహార్లు అర్పించారు.

ప్రెసిడెంట్ కెన్నడీ మరియు ఐదుగురు భారత సైనిక, వైమానిక దళ అధికారులు అయిదుగురి మృతిపట్ల వారి కుటుంబాలకు అత్యంత విచారాన్ని వ్యక్తపరిచే ఒక సంతాప తీర్మానాన్ని సభానాయకులు ప్రతిపాదించగా సభ ఆమోదించినది.

సభ్యులు ఒకనిమిషం పాటు నిలుచుని మౌనాన్ని పాటించారు. అమెరికా ప్రెసిడెంటు మరియు భారతీయ అధికారుల స్మృతికి గౌరవసూచకంగా అరగంట సేపు సభను వాయిదా వేశారు.

తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ, చిన్న వయస్సులోనే ఒకగొప్పదేశానికి అధ్యక్షుడుగా అయిన మూడేండ్ల లోపునే శ్రీ కెన్నడీ మరణించడం విషాదకరమనీ శ్రీ సంజీవరెడ్డి అన్నారు. నాగరికతకు ప్రఖ్యాతిచెందిన ఒక దేశంలో అలాంటి సంఘటన జరగడం మరింత శోచనీయమనిఆయనఅన్నారు. రష్యా సహకారముతో ప్రపంచ శాంతి సాధనకు కృషిచేస్తున్న కెన్నడీ ఈదళంలో మరణించడం దురదృష్టకరమన్నారాయన.

అయిదుగురు భారత సైనిక,వైమానిక దళాధికారులు మరణించడం దేశానికి పూరించజాలని నష్టమని శ్రీ రెడ్డి అన్నారు.

శ్రీ పి. సుందరయ్య

అమెరికన్లతో, వారి పాలనా వ్యవస్థతో తమకు పెక్కు విభేదాలున్నప్పటికీ, నీగ్రోల పౌరహక్కుల రక్షణకు ప్రెసిడెంటు కెన్నెడీ నిర్వహించిన పాత్ర మహోన్నతమైనదని తాము గుర్తిస్తామనీ ప్రతిపక్ష నాయకుడు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య పేర్కొనించారు.

తెన్నేటి విశ్వనాథం

ప్రపంచ వ్యవహారాల్లో ముఖ్యముగా అణ్వస్త్రపరీక్షల నిషేధ ఒప్పందంపై సంతకం చేయడానికి సంబంధించి ప్రెసిడెంట్ కెన్నడీ ప్రముఖమయిన పాత్ర నిర్వహించాడనీ, అంతేకాకుండా మన భూభాగంపై చైనా దురాక్రమణ జరిపినప్పుడు శ్రీ కెన్నడీ సింహంలా గర్జించి, యావత్ సహాయం చేయడానికి వాగ్దానం చేసినందుకు భారతీయుల మయిన మనమంతా ఆయనకు ఋణపడి ఉన్నామనీ నేషనల్ డెమోక్రాటికు పార్టీ నాయకుడు శ్రీ తెన్నేటి విశ్వనాథం తమ సానుతాపాన్ని వ్యక్తపర్చారు.

బి, వి సుబ్బారెడ్డి

ఒక ప్రపంచ పురుషుని, మరియు దేశములోని అయిదుగురు ఉన్నత సైనిక, వైమానిక దళాధికారులను మనం పోగొట్టుకున్నామనీ, అందువల్ల భారతదేశానికి ప్రత్యేకంగా ఇహలోక విచారకరమైన రోజనీ సభాపతి శ్రీ బి. వి. సుబ్బారెడ్డి అన్నారు.

శ్రీ నాగభూషణం, శ్రీ రాచంద్రరావు, దేశపాండే మరియు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య కూడా ఈ సందర్భంలో ప్రసంగించారు.

బ్రిటిష్ రాణి, ప్రధాని సంతాపం

లండన్‌లో కెన్నడీ హత్య చేయబడ్డట్టు వార్త అందగానే బ్రిటిష్ రాణి ఎలిజబెత్ మరియు ప్రధానమంత్రి శ్రీ హ్యూమ్ ప్రెసిడెంట్ కెన్నడీ కుటుంబానికి సంతాపసందేశాలు పంపించారు.

నాసింగ్ పిధి నెంబరు 10 నుండి ఈ కింది ప్రకటన వెల్వడినది: "అమెరికా అధ్యక్షుడు కెన్నడీ హత్యచేయబడ్డట్టు తెలిసినవార్త ప్రధాన మంత్రికి తీవ్రదిగ్భ్రాంతినీ, భయంకలిగించింది"

లేబర్ పార్టీ నాయకుడు శ్రీ హరోల్డు విల్సన్ ఇలా అన్నారు: "ఇట్టి రాక్షస చర్యపట్ల మనతీవ్ర భయాన్ని దేశ ప్రజల తరఫున వ్యక్తపరుస్తున్నాను".

విన్‌స్టన్ చర్చిల్

యుద్ధకాల ఫ్రిటన్ ప్రధాన మంత్రి సర్ విన్‌స్టన్ చర్చిల్ తమ విచారాన్ని ఇలాతెల్పారు: "ఈరాక్షస చర్యవల్ల ఒక గొప్ప రాజనీతిజ్ఞుడు, వివేకి, సాహసి మనమధ్య నుండి వేరుచేయబడ్డాడు. అమెరికాకు మరియు ప్రపంచానికి ఈనష్టం అనంతం".

జనరల్ డీగాల్

జనరల్ డీగాల్ తమసంతాపాన్ని ఈ కింది మాటల్లో వ్యక్తపరుస్తున్నారు: "తన కర్తవ్య నిర్వహణలో దేశసేవా ప్రయత్నంలో ఒక వీరునివలె ప్రెసిడెంట్ కెన్నడీ మరణించాడు. కెన్నడీ మహోత్కృష్టమై ఆదర్శానికి ఫ్రాన్స్ ప్రజల తరఫున నేను జోహార్లు అర్పిస్తున్నాను".

విజయలక్ష్మి పండిట్

ఐక్యరాజ్య సమితిలోని ఇండియా శాశ్వత ప్రతినిధి శ్రీమతి విజయలక్ష్మి పండిట్ తమ తీవ్ర విచారాన్ని ఇలా తెలియజేస్తున్నారు:

"ఆకస్మికమైన, మరియు తీవ్ర విషాదకరమైన ప్రెసిడెంట్ కెన్నడీ మరణం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంత పరిచినది. ఆయన మృతివల్ల మనమంతా దరిద్రులమైపోయాము. ఇంతకన్న ఘోరం మరొకటి ఉండదు. శ్రీమతి జాక్విలన్ కెన్నడీకి, వారి కుటుంబానికి, మరియు అమెరికాజాతికి భారతప్రతినిధివర్గం తరఫున సానుభూతిని, తీవ్రవిచారాన్ని తెలియజేస్తున్నాను".

ప్రెసిడెంట్ టిటో

ప్రెసిడెంట్ కెన్నడీ హత్యావార్త అందిన తక్షణమే బెల్‌గ్రేడ్‌లోనిఅమెరికా దౌత్య కార్యాలయానికి తన సంతాపాన్ని యుగోస్లేవ్ అధ్యక్షుడు టిటో టెలిఫోన్ ద్వారా తెలియజేశాడు. మార్షల్ టిటో ఇటీవలనే ప్రెసిడెంట్ కెన్నడీని 'వాషింగ్టన్'లో కలుసుకొన్నారు.

బ్రిటన్ మాజీ ప్రధాని అట్లీ

బ్రిటన్ మాజీలేబర్ ప్రధానమంత్రి వరల్ అట్లీ తమ విచారాన్ని వ్యక్తపరుస్తూ, "ఇది నిజంగా భయానకరమైన, విషాదకరమైన సంఘటన. ఆయన దూరదృష్టిగల, సాహసోపేతుడు. గొప్ప పనులు చేయగలిగేవాడు" అని ప్రస్తుతించాడు.

పోప్ పాల్

కెన్నడీమృతిపట్ల విచారాన్నివ్యక్తపరుస్తూ, ఆయన"గొప్పరాజనీతిజ్ఞుడు" అని పోప్ పాల్ అన్నారు.

ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యానికి, శాంతికోసం చేస్తూండిన కృషి కెన్నడీ త్యాగంవల్ల ఫలవంతం కావాలనిమేము భగవానుడిని ప్రార్థిస్తున్నాము. ఆయన అమెరికా ప్రథమ కాథలిక్ అధ్యక్షుడు అని పోప్ అన్నారు.

....—

విద్యా బోధకాలుగా చలన చిత్రాల ఉపయోగం

మద్రాసు ముఖ్యమంత్రి భక్తవత్సలం అభిభాషణ

మద్రాసు, నవం 23

మద్రాసు నగరంలో అమెరికా సమాచార కార్యాలయం వారు విజ్ఞాన దాయకమైన "అపూర్వ" చలనచిత్రాలను చూపుతున్నందుకు ముఖ్యమంత్రి శ్రీ ఎం. భక్తవత్సలం యు. ఎస్. ఐ. ఎస్. వారిని మెచ్చుకొన్నారు.

గత రాత్రి అమెరికా సమాచార కార్యాలయం లిటిల్ థియేటర్‌లో మద్రాసు ముఖ్యమంత్రికి, "పిలాసఫర్స్ జర్నీ" అనే రాష్ట్రపతి రాధాకృష్ణన్ అమెరికా యాత్రాచిత్రాన్ని "సమస్యలూ, పంపకాలూ" అన్న రాష్ట్రపతి టెలివిజన్ ఇంటర్వ్యూ చిత్రాన్ని ప్రత్యేకంగా చూపిన సందర్భంలో శ్రీ భక్తవత్సలం ఇట్లా ప్రశంసించారు. ఈటెలివిజన్ ఇంటర్వ్యూను అమెరికన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ఎలిసి వారు జరిపారు. ఈ ఫిల్ముల్లను మద్రాసు ఫిల్ముసొసైటీ, అమెరికా సమాచార కార్యాలయంవారూ కలిసి చూపారు. ఈ ప్రత్యేక ప్రదర్శనానికి వంద మందికి పైగా ఆహూతులు వచ్చారు.

ప్రదర్శనాంతంలో శ్రీ భక్తవత్సలం ప్రసంగిస్తూ, ఈ రెండు చిత్రాలనూ పిందుకు యు. ఎస్. ఐ. ఎస్. గారికీ, మద్రాసు ఫిల్ము సొసైటీవారికీ కృతజ్ఞత తెలిపారు. యు. ఎస్. ఐ. ఎస్. వారి చిత్రాలు విద్యాబోధన విలువ కలవని ఈ సందర్భములో ఆయన అన్నారు.

పోస్ట్ టెలిగ్రాఫ్ సర్వీస్‌ల ఆధునికీకరణ

న్యూఢిల్లీ, నవంబర్ 23

పెరుగుతున్న దేశప్రజల అవసరాల అనుసరించి పోస్టు మరియు టెలిగ్రాఫ్ సౌకర్యాలు మన దేశంలో ఆధునికం చేయబడుతున్నదని కేంద్ర మంత్రి ఎ. కె. సేన్ తెలిపారు.

కేంద్ర పోస్టు మరియు టెలిగ్రాఫ్ అడ్వయిజరీ కౌన్సిల్ రెండు రోజుల సమావేశాన్ని ప్రారంభిస్తూ బెంగ్లూర్‌లోని ఇండియన్ టెలిఫోన్స్ పరిశ్రమ పోస్టు అండ్ టెలిగ్రాఫ్ సౌకర్యాల ఆధునికీకరణకు తోడ్పడుతున్నదని శ్రీ సేన్ తెలిపారు. టెలిగ్రాములు అర్థంకాటుఅయినా కాకపోయినా చేసిన మూడు గంటల లోగా అందునటుల చర్యలు తీసుకోబడుతున్నాయని పిరన్నారు.

డాకాలో 8గంటల సేపు ఇండియన్ ఏర్‌లైన్స్ డకోటా నిలుపుదల

అగర్తలా, నవం 23

నిన్న డండం విమానాశ్రయమునుండి అగర్తలాకు బైలుదేరవెళ్ళిన ఇండియన్ ఏర్‌లైన్స్ డకోటా విమానము నేటి ఉదయం బలవంతాన ఢాకాలో దింపివేయబడింది. ఈ విమానము 21 మంది ప్రయాణికులతో ఉదయం 10 గంటలకు డండం నుండి బైలుదేరింది. ఢాకా విమానాశ్రయంనుండి అందిన వైర్లెస్ సందేశాలాధారంగా ఢాకాలో 11 గంటలకుదిగింది.

అక్కడ 8 గంటలసేపు ఆ విమానాన్ని విమానాశ్రయాధికారులునిలిపి ఉంచారు. పిమ్మట సాయంత్రం 6.55 లకు దాని ప్రయాణానికి అనుమతించారు.

ఇటువంటి సంఘటనే ఆరునెలల క్రితం ఒకసారి జరిగింది గాని అప్పట్లో ఐ.ఏ.సి. ప్యాసింజర్ విమానం ఒక్క గంట మాత్రమే నిలిపివేయబడింది.

వరంగల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గలభా

అధ్యక్షునితో సహా 14మంది వాకౌట్: నియామకాల ఉపసంఘాన్ని రద్దుచేస్తూ మిగిలినవారి తీర్మానం

వరంగల్, నవం 23

వరంగల్ మున్సిపాల్టీ నియామకాల ఉపసంఘాన్ని రద్దుపరచాలని కోరుతూ వరంగల్ మున్సిపల్ కౌన్సిల్‌కు చెందిన 21 మంది చర్చకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు కావాలని రిక్విజిషన్ తెచ్చినందున నిన్న హనుమకొండలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. అధ్యక్షుడు శ్రీ పి. ఉమారెడ్డి అధ్యక్షత వహించారు. ఉపసంఘ సభ్యులు తమ అధికారాలను దుర్వినియోగ పరచారన్న ఆరోపణలతో ఉపసంఘం రద్దును కోరడం జరిగింది.

ఈ సమావేశంలో చర్చ తీవ్రరూపం తాల్చింది. దానితో అధ్యక్షుడు శ్రీ ఉమారెడ్డి తనవర్గం 14 మందితో కలిసి వాకౌట్ జరిపారు. కౌన్సిల్ సమావేశాన్ని నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారు కూడా.

మిగిలిన 18 మంది కౌన్సిలర్లు ఉపాధ్యక్షుడు శ్రీ అదవాల సత్యనారాయణ అధ్యక్షతన సమావేశమై నియామకాల ఉపసంఘాన్ని రద్దుపరుస్తూ తీర్మానించారు. దానిస్థానే నూతన ఉపసంఘాన్ని నియమించే అధికారం శ్రీ మోహన్‌రావుకు ఇస్తూ కూడా తీరు తీర్మానించారు.

వరంగల్ మున్సిపల్ కౌన్సిల్‌లో సభ్యుల సంఖ్య 34. నిన్నటి సమావేశానికి 33 గురు హాజరయ్యారు.

సేద్యపు నీటి సౌకర్యాలూ, విద్యుచ్ఛక్తి వ్యవహారాలు

కేంద్ర మండలి సమావేశం

న్యూఢిల్లీ, నవం 23

నదీలోయ ప్రాజెక్టుల నిర్వహణలో ఎదుర్కొవలసి వస్తున్న ఇబ్బందులను నివారించేందుకు సేద్యపు నీటి సౌకర్యాలు, విద్యుచ్ఛక్తి వ్యవహారాల కేంద్ర మండలి కొన్ని సిఫార్సులు చేసింది. నాలుగు రోజులపాటు న్యూఢిల్లీలో జరిగిన యీ మండలి సమావేశం మొన్నటితో సమాప్తమయింది.

ప్రస్తుత ఎక్కౌంటింగు, ఆడిటింగు పద్ధతి పాతకాలపు పద్ధతిఅనీ, యంత్రాలనుపయోగిస్తూనూ, రోజుకు ఒకటి కంటె ఎక్కువ మిప్పులలో పనిజరుగుతున్న ప్రస్తుత కాలంలో సేద్యపు నీటి సౌకర్యాల కల్పన, విద్యుదుత్పాదన పథకాలను సమర్థంగానూ, సత్వరముగానూ అమలుజరిపేందుకు యీ పద్ధతి అనువైనది కాదనీ యీ మండలి అభిప్రాయపడింది.

ప్రస్తుతఎక్కౌంటింగు, ఆడిటింగుపద్ధతిలోస్వల్పమార్పులవల్ల పరిస్థితి మెరుగవదనీ, పెద్దమార్పులే చేయవలసి వుందనీ, యీ విషయాన్ని కూలంకషంగా పరిశీలించేందుకు ఒక ఉన్నతాధికార సంఘాన్ని ప్రభుత్వం వీలైనంత త్

గోలకొండ పత్రిక
వ్యాసానుబంధం

ఆదివారము * 24-11-1963 * హైదరాబాదు

అజ్ఞాతకవి విశేషరుడు:

అష్టావధాని ముదివర్తి రామకృష్ణరాయలు

ఒకప్పుడు ని ద్రాణమైయున్న తెలంగాణములో నివురు గప్పిన నిప్పుముక్కలవలె ప్రాభవైదు ష్ట వి భూషితులైన దిగ్దంతులవంటి కవి పండిత ప్రకాండులు మెండుగా నుండియుండిననూ, రాజ గౌరవముగానీ ప్రజాదరణముగానీ లేక వారి కావ్య రచనా పరిశ్రమ భస్మపుంజములో ప్రవేశిన హోమమువలె, బురదలో జోసిన పన్నీరువలె వ్యర్థమై ధరణిలో జాచిన ధనరాశి మాడ్కి నామమాత్రావ శిష్టమైపోయినది.

అట్టి అవిజ్ఞాత కవి కోవిదుల కావ్యములందలి వంశాచారమకరంద మధురిమ నాంధ్రలోకము నెదుట నుంచుట ఆంధ్రవిద్వత్కవిత ల్లజుల కర్తవ్యమై యున్నది.

నిజాము రాష్ట్రమున ప్రథమాంధ్ర మహాసభ జరిపించి ఆంధ్రదేశ చరిత్ర పుటలలో సువర్ణాక్షరాలతో లిఖింపందగి ప్రసిద్ధికెక్కిన మెదకు జిల్లాలోని ఆ దోలుతాలుక కేంద్రం జోగిపేటకు వాధుఁడగు "శ్రీ మజ్జోగినాథు చరిత్రము"ను విరచించి అపార పారావార సద్యశాంధ్ర కవితా రంగమున నిష్కళంక కమనీయ రమణీయ కవిత్వ వైభవుఁడై కాలగర్భమునఁ గలిసిపోయిన కవికుల తిలకుండు శ్రీ వత్స సగోత్రుండు, కొండలరావు రాగమాంబికల స్వీకృతవరనందనుండు, దూపాటి రత్నమార్యుని శిష్యుండు ముదివర్తి రామకృష్ణరాయ నామధేయుండు తరిగొప్పలనివాసి. ఇయ్యది వర గల్లు జిల్లాలోఁ జనగామకు సమీపమునసున్నది. ఇమ్మహాకవి వతంసుండు "శ్రీమజ్జోగినాథ చరిత్రము"న తన వృత్తాంతం బీవిధంబుగాఁ జెప్పుకొనెను.

"శ్రీవత్స సద్గోత్ర సింధువందుదనుంచి వెలసేని సత్కాంతి నెగడె ధరణి కొండల రావనుకో విదవర్యుడు రాగమాంబ వరించె రక్షిఁ దనర వారికి స్వీకృత వరనందనుండను రామకృష్ణారాయ నామకుండ నైజోగినాథుని నవ్యచరిత్రము పద్య కావ్యముఁ జేసి ప్రభలినాడ...."

కాని ఆ శ్వాసాంత గద్యలలోఁ "శ్రీవత్స సగోత్ర పవిత్రాపస్తంబ సూత్ర, రాఘవార్య పౌత్ర, నృసింహరాయ పుత్ర, చూడమాంబికా గర్భశుక్తిముక్తాఫల రామకృష్ణరాయ ప్లావధానినిచే కల్పింపంబడిన...." అని యుండుటచేఁ జూడమాంబికానృసింహరాయల కన్న కుమారుఁడై రాగమాంబా కొండలరావులకు దత్తపుత్రుఁడైనట్లు తెలియుచున్నది.

కనిన, పెంచిన ఉభయత్ర-తల్లిదండ్రులయెడ సమానభక్తి ప్రపత్తులు గలవాడై గ్రంథారంభమున పెంచిన వారియు, ఆ శ్వాసాంత గద్యలలోఁ గన్నవారియు వశ నామముల పేర్కొనియున్నాడు.

అట్టి యాంధ్రకవి పండిత మండల మండనుండగు రామకృష్ణరాయ కవి స్థానిక వర్తక వర్యుల ప్రోత్సాహ ప్రేరేపణలచేఁ దానీ గ్రంథమును రౌద్రినామ సంవత్సర కార్తీక శుద్ధ పంచమి వరకు పూర్తి గావించినట్లు చెప్పికొనినాడు. వంశక్రముఖులపేర్ల వల్లనూ, ఆతని సంతరించిన వృద్ధమనీషులిప్పటికిని యుండుటచేతనూ నేటికి 45 సంవత్సరముల క్రిందటి వాడని తెలియుచున్నది.

పూర్వ కవి సాంప్రదాయానుసారముగా నిరు పూర్వక విస్తుతి, శుకవినింద, వంశానుక్రమ డిక, షష్ట్యంతములు మున్నగునవి యథారీతిగా నున్నవి. పూర్వ కవి స్తుతిలోఁ సంస్కృత కవులలోఁ వ్యాస, దండి, భారవి, కాళిదాసు, భవభూతి, బాణులదలఁచి, తెలుఁగు కవులలోఁ నన్నయ్య తిక్కన పోతనలనుమాత్రమే పేర్కొనియున్నాడు.

నన్నయార్యునివలె ప్రసన్న కథాకలితార్థ యుక్తితోడనూ, తిక్కనవలె అలంతి యలంతి లేట తెలుగు మాటలతోడనూ రచించి పోతనను పోలి, "ఇమ్మను జేశ్వరాధముల" కంకిత ముగా నొసంగక అష్టాదశవర్ణనములతోఁ గూడి నవరసాలంకారభరితమై చదివిన కొలఁది చవులూరు నట్లొనర్చుచున్న శ్రీమజ్జోగినాథు చరిత్రమును శ్రీ జోగినాథునకే అంకితమిచ్చెను.

కవి కల్పిత కావ్యమనిఁ జేర్కొనినను కేవల కృత్రిమ రత్నము కాదు. రామరాజ భూషణునివలె మిత్రమ కథగాఁ బ్రవాసెను. సంగ్రహముగాఁ గథాంశమిది.

"ఒకనాడు శంకరుడు శాంకరి తోడఁ గేళి గృహమునందు విలాసముగాఁ రహస్య క్రీడలో నుండగాఁ శని ప్రవేశించిన శివుఁడు కోపించి పంపించుట. శనియలిగి దాక్షాయణిని దక్షాధ్వరమున యోగాగ్నిని దగ్ధమగునట్లు చేయుట. భోగిభూషణుండు సంసారమును రోసిత్యాగియై జోగియై దేశదేశములు తిరుగుచు వైక్రాంత పర్వతగుహలో (జోగినాథు పర్వతమునకు వైక్రాంత పర్వతమనియును నామాంతరములు) సమాధినిష్ఠుండై యుండుట. ప్రమథగణములు పార్వతికి పరమశివునిపై ప్రణయము ప్రభవింపఁజేయుట. మన్మథ దహనము. గంగాధరుండు గిరిజనువలచి నప్రస్తుతులను సంధానకర్తలుగాఁ హిమవంతుని కడకు వధూనిశ్చయమునకుఁ బంపుట బ్రహ్మాండాద్రులీ పర్వతముపై పార్వతీ పరమేశ్వరుల కళ్యాణముఁ జేయుట. చివరకు అక్కడనే గలిగిన గగనంబుఁ జేరినాడు

చిలుకల కొలికి నీ చిన్నారి పలుకులు
గనికాదె శుకములు గాచెనదవి
మెయిలీగెనునుకాంతి మెరుపెక్కుటుం
గాంచి
విద్యుల్లతలు మేఘవితతిదూరె
హరి మధ్య నీమధ్య మల్లాడుటలుగని
సింగములుగుహ లందు చేరెనహహా
చిగురుటాకులు నీహస్త చింతనమున
మావులందున జేరఁగాఁ మరులు
కొనియె
వేణిగిని నాగుపాములు వెరచిపుట్ట
లందు నివసింపదలఁచె లక్ష్యత్వమెదలి"

ఈ పద్య రత్నము హృద్యముగా నుండి నన్నెచోడ కవి రాజవిరచిత కుమార సంభవపంచమాశ్వాస పార్వతీ విరహవేదన ఘట్టములోని "బాల నీవేనలి కాలోరగంబని" అను పద్యమును స్ఫురింపఁ జేయుచున్నది.

బాలేందు ధరుండు కాషాయాంబరంబులు ధరించి
ఏటికి వెండికొండ యిక నేటికి
యక్షుడు సఖ్య మేటికిన్
ఏటికి నందికేశ్వరుఁడి కేటికి
బంధువు లాప్తవర్గముల్
ఏటికి సర్వసంపదలు, ఏటికి
భృత్యులు చండికాదులున్
ఏటికి తీర్థయాత్రలకు నేగెద
కాలము తీరునంతకున్"

అని బయలుదేరి నీరంధ్రి నిబిడాంధకార బంధురంబగు నొక ఖండపరశుఁడు మదినిండు కొలుపు అగ్ని ప్రదక్షిణ మాచరించెడు వేళ కేలునంటిగ హృదిగలుకొల్పు
ఏడు అడుగులు పెట్టుచు వేడుకలర
నొకరినొక్కరు చూతురు నోరగాను
వేదమంత్రాదు లెల్లను వినుచునుండి
పాయరింతైన హృదయము
పతియు సతియు.

ఇట్టి సర్వసామాన్యమైన పదములచేఁ గన్నుల యెదుట దృశ్యములను ప్రత్యక్షీకరింపఁ జేయుట మీతనికి వెన్నతోబెట్టిన విద్య. కావునే పై పద్యము స్వాభావిక హావభావ విలాసాది వర్ణనలతో గూడి కన్నులకు గట్టినట్లుండి చిన్న చిన్న పదములతోఁ జెప్పవలసిన భావములను ముక్కుసూటిగాఁ జక్కగాఁ జిక్కగాఁ దొంకతిరుగుడులేక చిత్రములు చిత్రించుట కనుకూలముగా నున్నది.

ఇయ్యది రెండాశ్వాసములు కలిగి 329 పద్య గద్య మిశ్రితమగు చంపూ కావ్యము. ఇందు 87 వచనములు, 78 కందములు, 56 గీతములు, 58 సీసములు, 40 ఉత్పలమాలలు, 12 చంపకములు, 8 మత్తేభములు, 5 ఇతరములు కలవు. ఇందు దేశి పద్యముల సంఖ్య యధికముగా నుండుటచే నీతఁడు శివకవుల కోవకుఁ జెందినవాడని యనిపించుచున్నది.

లిఖితప్రాత ప్రతిలో నెడయెడగత, సంధి, పదగత, ఛందోగత దోషములు చాలా కలవు. ఇవి వ్రాయసకాని వాతలోని ప్రమాదములు కానోపును.

శ్రీ ముదివర్తి వారి కబృములు దృశ్య శ్రవ్య కృతులని రెండు తెరగులు. దృశ్య కావ్యములలోఁ "హైమవతీ పరిణయము, రసాల ఫలము, ద్రౌపతి గర్వాపహరణము, రామ పట్టాభిషేకము, అను నాటకములును, తిరుమంగయాళ్వారి చరిత్రము, సౌగంధికాహరణము, లక్ష్మణా పరిణయము, మనోరమా విలాసము, విశ్వామిత్ర విజయము, సాంఘోపాఖ్యానము అను యక్షగానములును, శ్రవ్యకావ్యములలోఁ హైదరాబాదు చరిత్రము, నాగమడుగుమహాత్మ్యము. అను చంపువులు, రామలింగేశ, యాదవశతకములునూ ఈతని యితర కృతులు. ఇవి యన్నియు ముద్రితములో కావో తెలియదు.

ఇట్టి సులభసుందర సుకుమార మనోహర శైలిలో వ్రాయబడిన "శ్రీమజ్జోగినాథు చరిత్రము" అఖండలక్ష్మీ సంపన్నులునూ, వదాన్యశేఖరులునూ అయిన వర్తక వరేణ్యులచేతనే త్వరలో సూర్యాలోకనభాగ్యం బొందగలదని యాశించెద.

వేయికంఠాల మ్రోత

నిండామునిగిన వానికివలె ఎక్కడిది?
మొండిబ్రతుకు భయమెక్కడిది?
ఉండదు నీతి ప్రజాధనాపహరులకు
కుండపోతవంటితలపోతఇదేయర్థార్థం!
జీవితపు గోడలు బీటలువారినా గుండె
చెదరదు
అబద్ధానికి టైటిల్ పేజీ అబద్ధమే-
ఇది నిజం
పిందెదిగుటకు- పువ్వువికసించాలిగా
పండురాలుటకు-పక్వమునకు
రావాలిగా
అంతిమ విజయానికి-కాలమేరాచబాట
నాయకత్వంలో గుట్టలెక్కినా-
గుళ్ళుచుట్టినా-నడకసాఫీ.
కాంతా కనకాల మోజులో-
పానీయాల విందులలో
వేకమేడలో-వేలపైకం తివాసీపరచిన
జీవితవలయ భ్రమణం-దుస్సాహసమే!
స్వార్థ నాయకత్వం-తేనెపూతకత్తి
రల్బరు బుడగతీరు-
వేయికంఠాల మ్రోతనుదిక్కరించి
గడ్డిపరకలూతగా ఈదేనామహా
సాగరం?
ఎక్కరా! సీజర్-నెపోలియన్-
అలెగ్జాండర్లు
ఏరి? హిట్లర్-స్టాలినులు-పేర్లేలేవే?
చరిత్రతాచాబా!
అందుకే అంతిమ విజయానికి కాలమే
రాచబాట!

—"రోహిణి"

శ్రీ యమ్. రంగకృష్ణమాచార్యులు

చిన్న పల్లెను తన పేరున జోగిపేటపురమును నిర్మింపఁజేసి రాజరాజేశ్వరుడై గ్రామ పశ్చిమ భాగమున నిల్పుట".

ఇందలి యితివృత్తము పురాణ ప్రసిద్ధమైన గాథయే. ఇందు యోగిగా నున్నపుడు పరమశివుండిచ్చటికే తెంచినట్లునూ, వివాహమిచ్చుటనే జరిగినట్లునూ వ్రాసిన భాగము మాత్రమే కల్పితము.

అంతియేగాక నిందులోగల నూతనాంశము శివపార్వతుల వివాహమునకు దేవతలకై తారకాసురుని వధించుటకుఁ గావలసిన సేనాని కుమార జననము కారణమని పురాణములు చాటుచుండగా, నిందు త్రినయనుండు త్యాగియై జోగియై కైలాసమును వీడి, దేశాంతరగామికాగా కైలాసము పాడువడిపోవ, ప్రమథగణములు విచారించియు, ఆలోచించి "గృహిణీ గృహ మూలంబు"అని నిశ్చయించి, బ్రహ్మాండాద్రి బృంగారక బృందంబులతోఁ గలిసి, హైమవతీ కైలాసపతులకు పరస్పరము వలపులు తొలకరింప జేసి, యోగిని భోగిగా మార్చి, కైలాసమునకు రప్పించుట. కథాగమనమున కాటంకము కలుగకుండగ సందర్భానుసారముగాఁ గరుడగంగా (మంజీరా నదికి యిచ్చటగల నామాంతరము) వృత్తాంతమును, జోగిపేట చరిత్రమును, వర్తకుల విదాన్యత్వమును, రాజా సదాశివరెడ్డి గాథయు నిందుల్లేఖింపబడినవి.

ఇది సులలిత సుకుమార సుందర పదజాలముతో నొప్పారుచుఁ దిక్కన సూరనలకబృములను దలపించుచు నాటకములోని సంభాషణలవలె పద్యముల నడకసాగినది. శని శంకరుని కడకు వచ్చి నమస్కరించి వినముఁడై నిల్చిన నిటలాడుండు.

"ఎక్కడినుండి యెక్కడికి నేగుచు
నుంటివి సూర్యపుత్ర, నీ
వెక్కడి కేలవచ్చితివి వీరలు కూరులు
ధర్మవర్తనుల్
ఇక్కడ నుండగాఁ దగవె ఈ విటు
రాకడ పాడిగాదనన్
బొక్కుచుఁ మ్రొక్కియిట్లనియె
భోరున నశ్రులు వెల్లిగొల్పుచున్."

శృంగారము ప్రతిపాదించు ఘట్టమున అనౌచిత్యమును చెంతకు జేరనీయక నిగ్రహము వహించినాడు. ఈశ్వరుఁడు సతీ వియోగమునకు విలపించుట.

గరిత నీముఖ కాంతిగని యోడి
నెలరేడు
సిగ్గున గగనంబుఁ జేరినాడు

గుహయందు" నివసించెను. అక్కడగల జోగిపేట పురవరము నిట్లు వర్ణించెను. అప్పురంబునగల రథుల విద్యా ప్రౌఢినలువను మెప్పింతు నవనిసురులు అప్పురంబునగల యఖిలక్షత్రియవరుల్ వరుశురాముని గెల్చు బాహుబలులు అప్పురవరమున యలరారు వైశ్యులు కిన్న కేంద్రుని కల్మి కిరియలగొనరు అప్పురవరము నయలరారుపాదజుల్లాలముఖాంత విభూతి నలరుచుండు రంభలనదల్చు వణ్యలు రాగ నృత్య గీతముల నొప్పి వేశ్యల కీర్తిగొనిరి జోగిపేట పురివర భోగములను మెప్పుగనచెప్పు శాస్త్రములెన్నెప్పు వడయ.

ఇయ్యది అతిశయోక్త్యలంకారముతో గూడి మనుచరిత్ర ప్రథమాశ్వాములోని అరుణాస్పదపుర పద్యమును విజయవిలాసము నందలి ఇంద్రపస్థపురస్థచాతుర్వర్ణ్య వర్ణన "తడబాటు గలదు" అను పద్యములలోని పదములను తారుమారుచేసి భావము నాసాంతము గ్రహించి వ్రాసినట్లున్నది.

ఇట్లిందు చూచిన కొలఁది ప్రతి పద్యమునకు మన పూర్వకావ్య ప్రబంధాదులగు కుమార సంభవ మనుచరిత్ర విజయవిలాసాదులలోని పద్యములకు పుత్రికలోఅనుకరణములోఁ దొరకును. మన్మథుఁడు మొదట వెరచినను తరువాత దేవతల ప్రేరేపణచే బల్కిన పొరుషోక్తులలో నొక్కటి మచ్చుకు.

పన్నగ భూషణుండెటుల
పారినవైనను మిన్ను దూరినన్
సన్నుతనూ రసాతలము
చాటుకు నేగిన బన్న మొందినన్
గ్రన్నన యాశమంబులను
గాంచిన నా పని తప్పబోవునే
సున్న మొనర్చి నాలిరుఁదు చూపెద
మా పెద చంద్రశేఖరున్"

విజయ విలాసమున చేమకూర వేంకటరాజు సుభద్రార్జునుల వివాహ ఘట్టమునకును ఇందలి పార్వతీ పరమేశ్వరుల వివాహ ఘట్టమునకును చాలా పోలికలు కన్పట్టుచు మన ఆంధ్ర వైదిక కుటుంబములలో జరుగు వివాహములను దలపించును.

ముత్యాలు పార్వతీ ముదిత
దోసిటబోసి
తాపోయ చండిక తలనువంచు
పార్వతి పోయగాఁ బంచబాణునివైరి
శిరమును వంచును శీఘ్రగతిని
మృగనేత్రి మోముపై మొలక
నవ్వులు పర్వ

సహస్ర గణమాలిక-వెల్లగొండ మహాదేవుఁడు

పాల్కురికి సోమనాథ మహాకవి పండితారాధ్య చరిత్రమును రచించెను. అయ్యది దేశి కవిత్వమునకును, ద్విపద కావ్యములకును మార్గదర్శకము. ఇట్టి యుత్తమ కృతిని బృహత్ప్రీతికతో నాంధ్ర గ్రంథమాలవారు 80 వ, పుష్పముగా వెలయించి చిరకీర్తికి పాత్రులైరి.

పండితారాధ్య చరిత్ర మహిమ ప్రకరణ మధ్యమమున సహస్రగణ మాలికా స్తవము విరాజిల్లుచున్నది. ఇందు ప్రమథగణములు, రుద్రగణములు, యోగాచార్యులు, అరువత్తుమువ్వురు,షోడశగణములు దశగణములు, త్రయోదశ గణములు పురాతన భక్తులు కలసి సహస్ర గణమాలిక యైనది.

మల్లికార్జున పండితారాధ్యుఁడు వెలనాటి చోడుని సభలో బౌద్ధులను జయించిన తర్వాత శివనిందవిన్న పాపము పోవుటకు నీగణ సహస్ర నామములు పఠియించెను. ఈమాలికా పఠన మత్యంత మహిమాన్విత మైనదని సోమనాథుఁడిట్లు చెప్పెను.

"అరయనీకృతి సారమగుచుచతుర్ధ
ప్రకరణ మధ్య సంకలితమై
వెలుఁగు
నవ్యగణ సహస్ర నామస్తవంబు
భవ్యముగ పఠించు ఫలలేశమునను.
నైహికాముష్మి కాద్యఖిల సంపత్స
మీహితాభీష్ట సౌఖ్యము లొందు
ననిన

బ్రమథ రుద్రాది పురాతన నూతన మహాగణాభి వర్ణనము లోకముల,

అని నవ్యగణ సహస్ర నామస్తవముచే తన కృతియైన పండితారాధ్య చరిత్రయే, చరితార్థమైనదని సోమనాథుఁడు భావించెను.

పండిత బండారు తమ్మయ్యగారి మధ్యన సోమనాథుని లఘుకృతులను ఒకచోటచేర్చి ప్రకటించిరి. శ్రీయుతులు నిడదవోలు వేంకట్రావు గారాలఘు కృతులను గూర్చియు, అందలి "సహస్రగణ మాలిక" మాహాత్మ్యమును గూర్చియు, డిసంబరు 1962 భారతిలో నిట్లు సెలవిచ్చిరి.

విజయనగర రాజ్యపాలకులగు వీర నరసింహరాయల కాలము నుండియు, నీమాలికా పఠనము జరుఁగుచున్నదనియు, రాయలు కూడా బాహ్మి ముహూర్తమున లేచి యారాధ్యులవారి నామావళి పఠించు వారనియు, మరియు తమ జనకులు కీ. శే. సుందరము పంతులవారు ఈ నామావళిని పారాయణముచేసి, యభ్యుదయము నొందుటతాము స్వయముగా నెరింగిన విషయమనిరి. గణమాలికా స్తవము మొదట పండితారాధ్యులవారే తమ చివరి కృతిగా సంస్కృతమున వెలయించుచు, తమ సమకాలికులైన మహాభక్తుల నామములందు చేర్చెననియు, తర్వాత తెలుఁగు కన్నడములలో పాల్కురికి సోమనాథుఁడు వ్రాసెననియు శ్రీ వేంకట్రావు గారభిప్రాయపడిరి.

గణమాలిక పేర్కొన్న పురాతన భక్తులలో బసవేశ్వరుఁడు చెన్న బసవఁడు మడివాలు మాచయ్య, కక్కయ్య, ఉడితడి మహాదేవి బెజ్జమహాదేవి, చిరుతొండనంబిమున్నగు నిగహానుగ్రహ సమర్థులైన మహాభక్త శిఖామణులందు వెల్లగొండ మహాదేవుఁడ ను భక్తుఁడు ను పేర్కొనఁబడెను.

వెల్లగొండ నామాంకితములైన గ్రామము లనేకములుగా నుండుటయు అందు నేయెల్లగొండలో నీ భక్తుఁడుండెనో తెలియ వచ్చెడిది కాదు. అరువత్తు ముప్వురు, పురాతనులలో తెలుఁగు జొమ్మయ్య ఒక్కఁడు మాత్రమే తెలుగు దేశమునకు జెందిన శివశరణుఁడని కన్నడిగులచే నూహింపబడుచున్నది కాని అది సరికాదు. వెల్లగొండ మహాదేవుఁడు, సత్యక్క, గంగాపురము బసవయ్య,వని పురి శంకరయ్యకొలిపాకమీరయ్య మున్నగువారు తెలుఁగు దేశమునకు చెందిన మహాభక్తులని చెప్పుటలో సంశయములేదు.

ఇఁక వెల్లగొండ మహాదేవయ్యనుగూర్చి విచారింతము. తెలంగాణా ప్రాంతమందలి మహబూబు నగరం జిల్లా కొల్లాపురము తాలూకాలో కృష్ణానది కారుమయిళ్ళ మేరన వెలుగొండయను గ్రామమున్నది దానికించుక దూరముననొక యెత్తైన పర్వతము కలదు దాని ప్రక్కన మరొక తెల్లని రాళ్ళుగల పర్వతమున్నది. ఈరెంటి సమ్మేళనము పానవట్టముతో కూడిన మహా శివలింగమువలె నుండి చూపరుల కద్భుతము గొల్పుచుండును. తెల్లని శిలాఖండములచే నొప్పారుట దీనికి వెల్లకొండయను పేరు సార్థకమగు చున్నది.

కొండపై రెండు కుండములు కలవు. అందొకటి పెద్దగాను మరొకటి మరీ చిన్నగాను ఉన్నవి. ఆ పరిసరములలో దేవాలయమున్న గుర్తు లనేకములు కన్పట్టును. అచ్చట ఒక్క భైరవుని విగ్రహము దాని కీవలావల స్త్రీ పురుష విగ్రహములు కన్పట్టును. ప్రాంతీయులీ

విద్వాన్ బెళగొంది మఠం వీరభద్రశర్మ

కొండను కొందరు బయ్యన్నగుట్ట యనియు, మరికొందరు మయ్యన్నగుట్ట యనియు, చెప్పుకొను వాడుక కలదు.

మహ + అన్న॥ మయ్యన్నగాను మయ్యన్న శబ్దము క్రమముగా బయ్యన్నగాను వికృతి రూపము ధరించిన దనుటలో సందేహము లేదు. పర్వతోపరి భాగమున నున్న స్త్రీ పురుష విగ్రహములు, వెల్లగొండ మహాదేవుఁడు మరియు ఆ మహా భక్తుని ధర్మపత్నికి సంబంధించినవై యున్న వే మో! వెల్లగొండచుట్టు పరిసర గ్రామములవారు, ఈబయ్యన్న పర్వతమును గూర్చి యెంతయో మహాభక్తి కన్పరచెదరు.

శివరాత్రి మున్నగు మహా పర్వదినసములలో నచ్చటికి వెళ్ళి స్నాన పూజాదులు కావింతురు రోగిష్ఠులైన మానవులకు, రోగ పీడితములయిన పంటచేలకు మయ్యన్న కుండములోని తీర్థము పరమౌషధముగా భావింపబడుచున్నది. మొక్కుబడులు చెల్లించుట, బిడ్డలకు మయ్యన్నయను నామములుంచుట నేటికిని జరుగుచున్నది. ఈ మొదలగు నిదర్శనములచే సహస్ర గణమాలికలోని వెల్లగొండ మహాదేవుఁడు నివసించిన స్థల మిదియే యని తోచకమానదు. మహిమ ప్రకరణమున మకుటాయ మానముగా నున్న వెల్లగొండ మహాదేవయ్యగారికథ ఇట్లు తెల్పబడినది.

వెల్లగొండ మహాదేవుఁడు వేకువ ఝామునసే లేచి, తుమ్మెదలు పుష్పమరందా పచయము గావింపకమున్న, పుష్పాడి రాల్పకయ మున్న, వివిధ పుష్పములను గోసి తెచ్చి నిత్య శివార్చన గావింపుచు భృత్యాచారము నెరపుచుండెను. ఒకనాడు పుష్పములను తెచ్చుటకయి మిక్కిలి యాతురతతో వెడలుచుండగా పాదములు శివార్చోపకరణములఁదగు లుటయు, తన్మహాపరాధమునకు శిక్షగా తనకుతానయి రెండు కాళ్ళను ఖండించుకొనుటయు జరిగినది. పండితారాధ్య చరిత్ర మీ సన్నివేశము నిట్లు వర్ణించెను.

"వంతయు జింతయు వరల బుష్పముల
కెంతయు సంభమా క్రాంతుఁడై
యరు గఁ
గాళ్ళు శివార్చోపకరణముల్
దాఁక
గాళ్ళను రెండు నఖుణము గుత్తు
లకుఁ
గడికండలు గఁగొట్టి కలుపంబు
పుట్టి
మృదుని ముందరవెట్టి మెరుపడిఁ
బెట్టి
భవమున కొరగట్టి ప్రతిలేని యట్టి
శివభక్తి దుదముట్టి చింత పోదట్టి"

ఇట్లు ఖండితములయిన పాదములను శివుని ముందటబెట్టి శివభక్తి గమ్యస్థానము చేరినదని నిశ్చింతుఁ

దేశంలో ద్రాక్షతోటల పెంపకం

మాధుర్యానికి పేరుగన్న ద్రాక్షపళ్ళ తోటలను మన దేశంలో యిప్పుడు విస్తృతంగా పెంచుతున్నారు.ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్ర, మద్రాసు, మైసూరు రాష్ట్రాలలో ద్రాక్షతోటల విస్తీర్ణం క్రమేణా హెచ్చుతోంది. పంజాబు, ఢిల్లీ, హిమాచల ప్రదేశ్ల శీతోష్ణస్థితి ద్రాక్షతోటల పెంపకానికి ఎంతో అనువయినది. మేలయిన ద్రాక్ష రకాలను రూపొందించేందుకు ప్రస్తుతము విరివిగా పరిశోధనలు సాగుతున్నాయి. ఈపరిశోధనల ఫలితంగా, భారతదేశం ద్రాక్షపళ్ళ విషయములో త్వరలోనే స్వయం పోషకత్వాన్ని సాధించుకోనున్నది.

భారతదేశంలో యిప్పుడు పదివేల ఎకరాల విస్తీర్ణంలో ద్రాక్షతోటలు పెంచబడుతున్నాయి. ఈ పళ్ళకు నానాటికీ గిరాకీ హెచ్చుతున్నందున, మరింత హెచ్చువిస్తీర్ణంలో ద్రాక్షతోటలను వేయవలసి వుంది.

ఆంధ్రప్రదేశ్, మైసూరు, మద్రాసు రాష్ట్రాలలో ద్రాక్షతోటల పెంపకం లాభసాటివ్యాపారమని అనుభవము నిరూపిస్తోంది. ఉదాహరణకు, అనబ్-ఎ-షాహీ, పచ్చ ద్రాక్ష రకాలు సాలీనా ఎకరానికి 16 వేల కిలోగ్రాముల నుంచి 32 వేల కిలోగ్రాముల వరకూ దిగుబడి నిస్తున్నాయి. అలాగే భోక్రిరకం 14 వేల కిలోగ్రాములూ, బెంగుళూరు నీలము సాలుకు దాదాపు 5 వేల కిలోగ్రాములూ చొప్పున దిగుబడినిస్తున్నాయి. దాఖ్ రకం ద్రాక్షదిగుబడి కూడా గణనీయమే.

